జిల్లాకు చేరిన పది ప్రశ్నాపత్రాలు

పోలీసు స్టేషన్లకు తరలింపు



అధికారుల సమక్షంలో ప్రశ్నాపత్రాలను దించుతున్న సిబ్బంది

అనంతపురం విద్య, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ప్రశ్నాపత్రాలు జిల్లాకు చేరాయి. గురువారం ప్రశ్నాపత్రాలు(సెట్-1) ప్రత్యేక వాహనంలో జిల్లా కేంద్రంలోని కేఎస్ఆర్ హైస్కూల్‌కు చేరాయి. డీఈఓ ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవింద్ నాయక్, ఇతర రెవెన్యూ అధికారుల సమక్షంలో సీల్ ఓపెన్ చేశారు. తర్వాత జిల్లా వ్యాప్తంగా 11 రూట్లలో పరీక్షా కేంద్రాల సమీపంలోని పోలీసు స్టేషన్లకు తరలించారు. స్థానికంగా పరీక్షల విభాగ అధికారులు, రూట్ ఆఫీసర్ల సమక్షంలో ప్రశ్నాపత్రాలను భద్రపరిచారు. శుక్రవారం సెట్-2 ప్రశ్నాపత్రాలు జిల్లాకు వస్తాయని ఏసీ గోవింద్ నాయక్ తెలిపారు.

10న ముగియనున్న డిగ్రీ పరీక్షల ఫీజు గడువు

ఎస్కేయూ సీఈ డాక్టర్ లోకేష్

అనంతపురం సెంట్రల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): డిగ్రీ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు ఈనెల 10వ తేదీతో ముగియనున్నట్లు ఎస్కేయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ (సీఈ) డాక్టర్ లోకేష్ తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీబీఎం విద్యార్థులకు ద్వితీయ, నాలుగో, ఆరో సెమిస్టర్ నిర్వహణ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 24న విడుదల చేశామన్నారు. జరిమానా లేకుండా 10 వరకు, రూ.500 జరిమానాతో 12 వరకు ఫీజు చెల్లించవచ్చునని తెలిపారు. 15వ తేదీ వరకు రూ.3వేల జరిమానాతో కట్టాల్సి ఉంటుందన్నారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు.. విద్యార్థులకు సమాచారం అందించి, ఫీజులు కట్టేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

సీనియారిటీ జాబితాపై 226 అభ్యంతరాలు

అనంతపురం విద్య, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాపై ఇప్పటి వరకూ 226 అభ్యంతరాలు వచ్చాయి. నిన్నటి వరకూ 103 అభ్యంతరాలు రాగా... గురువారం మరో 123 అందాయి. మూడు రోజులుగా 226 అభ్యంతరాలు వచ్చాయి. జిల్లాకు వచ్చిన ఆర్జేడీ శామ్యూల్.. జిల్లా కేంద్రంలోని సైన్స్ సెంటర్‌లో అభ్యంతరాల స్వీకరణ కౌంటర్లను సందర్శించారు. డీఈఓ, ఇతర అధికారులను అభ్యంతరాలపై ఆరా తీశారు. వాటిని ఎప్పటికప్పుడు సవరించాలని ఆదేశించారు.

ఆర్జేడీని కలిసిన ప్రైవేటు స్కూళ్ల సంఘం నేతలు



ఆర్జేడీని కలిసిన ప్రైవేటు పాఠశాలల సంఘం నేతలు

అనంతపురం జిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం నాయకులు.. ఆర్జేడీ శామ్యూల్‌ను కలిశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, సీఆర్వో రవిచంద్రారెడ్డి, నాయకులు రామాంజనేయులు, రాఘవేంద్ర, విజయ్‌కుమార్, నరేంద్ర తదితరులు.. ఆర్జేడీని కలిసిన వారిలో ఉన్నారు.

నిజాయతీగా పని చేయండి

జిల్లాకు కేటాయించిన ప్రొబేషన్ ఎస్ఐలకు ఎస్పీ సూచన



ప్రొబేషన్ ఎస్ఐలతో ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నీతి, నిజాయతీతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ జగదీష్.. ప్రొబేషన్ ఎస్ఐలకు సూచించారు. జిల్లాకు కేటాయించిన 17 మంది ప్రొబేషన్ ఎస్ఐలు.. ఎస్పీని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారితో స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ... క్రమశిక్షణ, పారదర్శకత, జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీసీ ఆంజనేయప్రసాద్, ఆర్ఐలు మధు, రాముడు, ఎస్బీ ఎస్ఐ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

అనంత మహిళా వేదిక నేతలు



మాట్లాడుతున్న అనంత మహిళా వేదిక నేతలు

అనంతపురం కల్చరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని లలిత కళా పరిషత్‌లో ఈనెల 9న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని అనంత మహిళా వేదిక నేతలు పద్మజ, సావిత్రి పిలుపునిచ్చారు. లలితకళా పరిషత్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ... మహిళా సాధికారత, హక్కులు, సమానత్వం, బాల్యవివాహాలు, బాల కార్మికుల నిర్మూలన, మొబైల్, డ్రగ్స్ బానిసత్వం వల్ల కలిగే దుష్పరిణామాలపై తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కృష్ణకళామందిరం నుంచి లలితకళాపరిషత్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వేదిక నేతలు డాక్టర్ హేమలత, జయంతి, డాక్టర్ ఎంఎస్ బృంద, సుశీల, అశ్విని పాల్గొన్నారు.

ఖాద్రీశుడి సంబరం



9న అంకురార్పణ.. 20న తేరు..

బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన స్వామి

పక్షం రోజులు కదిరిలో సందడే సందడి

6

మెడికిల్ షాపులు..!



ప్రజల ప్రాణాలతో చెలగాటం

డాక్టర్ చీటీ లేకుండానే మందులు ఇస్తున్న వైనం

కాలంచెల్లినవి, స్టెరాయిడ్స్ అంటగడుతున్న వైనం

కళ్యాణదుర్గం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కొందరు మెడికల్ షాపు నిర్వాహకులు.. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. అనుమతులు లేకుండానే షాపులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. వైద్యుల చీటీ లేకుండానే జనాలకు మందులు ఇస్తూ.. వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కాలంచెల్లిన మందులు, స్టెరాయిడ్స్ విచ్చలవిడిగా అంటగడుతున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఓ మండలం స్టెరాయిడ్స్ విక్రయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వాటిని వేసుకున్న జనం ప్రాణాపాయంతో ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇదంతా పబ్లిక్‌గానే సాగుతున్నా.. నియంత్రించాల్సిన అధికారులు చోద్యం చూస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.



డిస్కౌంట్లతో ఆకర్షణ

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 40కి పైబడి మెడికల్ షాపులున్నాయి. వీటిలో 30 షాపులకు లైసెన్సు ఉంది. మిగిలిన 10 అనుమతులు లేకుండా నడుస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. లైసెన్సు ఒకరి పేరు మీద ఉంటే, మరొకరు మెడికల్ షాపు నిర్వహిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. ఆయా ప్రాంతాన్ని బట్టి రోజుకు ఒక్కో షాపులో రూ.20 వేల నుంచి రూ.లక్షలకు పైగా వ్యాపారం సాగుతోంది. ఇటీవల మెడికల్ షాపుల్లో కొన్ని మందులపై డిస్కౌంట్ ఇస్తూ వినియోగదారులను ఆకట్టుకుంటున్నారు. కొంతకాలం కస్టమర్లను ఆకర్షించేందుకు ధరలపై 30 శాతం డిస్కౌంట్ అని బోర్డులు పెడతారు. రానురాను బోర్డు అలాగే ఉన్నా.. డిస్కౌంట్ తగ్గిపోతుంటుంది. కళ్యాణదుర్గంలో కొన్ని మెడికల్ షాపుల్లో అన్ని రకాల మందులపై 20 నుంచి 30 శాతం డిస్కౌంట్ ఇస్తామని ప్రకటించారు. దీంతో ఇతర దుకాణదారులు.. వారిపై దాడులకు ప్రయత్నిస్తున్నారు. 30 శాతం ప్రకటించిన దుకాణదారుడు ఇప్పుడు 20 శాతం మాత్రమే డిస్కౌంట్ ఇస్తున్నారు.

మెడికల్ షాపుల నిర్వాకాల్లో కొన్ని..

- కళ్యాణదుర్గంలో ఒక యువతి అవాంఛిత గర్భం దాల్చడంతో మెడికల్ షాపు నిర్వాహకుడిని ఆశ్రయించింది. ఇదే అదునుగా గర్భనిరోధక మాత్రలను రూ.550కి విక్రయించారు. ఆ మాత్రలు వేసుకున్నాక అధిక రక్తస్రావమై, యువతి ఆస్పత్రి పాలైంది.
- కళ్యాణదుర్గం మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి చిన్న జబ్బుకు మాత్రలు అడగ్గా.. పట్టణంలోని ఓ వ్యాపారి నాలుగు రకాల మందులు ఇచ్చాడు. వాటిని వినియోగించిన వ్యక్తి రెండ్రోజులకే తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. పరిశీలించగా.. అవి కాలం చెల్లిన మందులుగా తేలింది. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు.. షాపు నిర్వాహకుడితో ఘర్షణకు దిగారు. విషయం బయటకు పొక్కకుండా దుకాణ యజమాని రూ.10 వేల వరకు ముట్టజెప్పినట్లు తెలిసింది.
- నియోజకవర్గంలోని ఓ మండలంలో విచ్చలవిడిగా స్టెరాయిడ్స్ ఇస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అలా వేసుకున్న.. స్టెరాయిడ్ ఓ రోగి ప్రాణాల మీదకు తెచ్చింది. చివరకు అనంతపురం వెళ్లి చికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. ఇదే మండలంలోని ఓ మెడికల్ షాపులో సూది వేసి, మందులు కూడా ఇస్తున్నారు. ప్రతి జబ్బుకు సెలైన్ బాటిల్ పెట్టి, ఒక్కో రోగి నుంచి రూ.200 నుంచి రూ.500దాకా గుంజుతున్నారు. మండలం.. స్టెరాయిడ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

డాక్టర్ చీటీ లేకుండానే...

దగ్గు, జలుబు, సాధారణ జ్వరానికి మెడికల్ షాపుల్లో మందులను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. యజమానులు చిత్తు కాగితాల్లో ధరలు వేస్తున్నారు. రోగులు అడగ్గానే మెడికల్ షాపుల నిర్వాహకులు ప్రాణాంతకమైన నిద్రమాత్రలు, స్టెరాయిడ్స్ ఇస్తున్నారు. అది కూడా డాక్టర్ చీటీ లేకుండానే. డాక్టర్ ఒక మాత్ర రాస్తే మెడికల్ షాపుల్లో మరొకటి ఇచ్చి అదే కాంబినేషన్ అని చెబుతారు. కాంబినేషన్ ఒకటే అయినా.. అది తక్కువ ధర, ఎక్కువ కమీషన్ ఇచ్చే మాత్ర అయి ఉంటుంది. ఇలా చాలా మందుల దుకాణాల్లో మోసాలకు పాల్పడుతున్నారు.

తనిఖీలు చేస్తున్నాం

మెడికల్ షాపులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. నిబంధనలు పాటించని వాటిపై చర్యలు తీసుకుంటున్నాం. మందుల విక్రయాలకు సంబంధించి బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి. కాలంచెల్లిన మందులు విక్రయిస్తున్నా, రికార్డులు సక్రమంగా లేకపోయినా చర్యలు తప్పవు. అనుమతులు కూడా రద్దు చేస్తాం.

-హనుమన్న, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, అనంతపురం

అధ్యక్షా.. తొలిసారి మీ ద్వారా..!

డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించండి

అసెంబ్లీలో గళం విప్పిన ఎమ్మెల్యే దగ్గుపాటి

అక్టోబరు 2లోపు పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ



అనంతపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అనంత ప్రజలకు తీవ్ర ఇబ్బందికరంగా మారిన డంపింగ్ యార్డును మరో చోటకు తరలించేందుకు స్థలం కేటాయించాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రభుత్వానికి విన్నవించారు. ఎమ్మెల్యేగా తొలిసారి అసెంబ్లీలో గళం విప్పిన ఆయనకు.. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లభించింది. అక్టోబరు 2 నాటికి డంపింగ్ యార్డును తరలిస్తామని ప్రభుత్వం తరఫున రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టమైన హామీ ఇచ్చారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే గురువారం తొలిసారి గళం విప్పారు. ప్రజల వాణిని వినిపించారు. నగరానికి అతిపెద్ద సమస్యగా మారిన డంపింగ్ యార్డు గురించి మాట్లాడారు. నగర జనాభా 4.90 లక్షలు కాగా, ఏటా 2.05 శాతం పెరుగుతోందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 50 నగరపాలక డివిజన్లు, నాలుగు పంచాయతీలు ఉన్నాయని తెలిపారు. రెండు దశాబ్దాల క్రితం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా నగర శివారులో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారని అన్నారు. నగరం విస్తరించిన నేపథ్యంలో డంపింగ్ యార్డు కాలనీల మధ్యకు చేరిందని అన్నారు. చుట్టుపక్కల నివాసముంటున్న ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, రోగాల బారిన పడుతున్నారని అన్నారు. డంపింగ్ యార్డు బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారికి ఆనుకుని ఉందని, దాన్నుంచి వచ్చే పొగ కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. డంపింగ్ యార్డును తరలించేందుకు దాదాపు 50 ఎకరాల స్థలం అవసరమని, ఆ మేరకు స్థలం కేటాయించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం తరఫున రెవెన్యూ మంత్రి స్పందించారు. అక్టోబరు 2 నాటికి 50 ఎకరాల స్థలం సేకరిస్తామని, డంపింగ్ యార్డును మార్చి ప్రజలకు ఆ బాధల నుంచి విముక్తి కలిగిస్తామని హామీ ఇచ్చారు. ఆ విషయాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. సానుకూలంగా స్పందించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రెవెన్యూ, మున్సిపల్ శాఖ మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బోగస్ మస్టర్ల నమోదు

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్..

ఒకరికి షోకాజ్ నోటీసు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): బోగస్ మస్టర్లు నమోదు చేసిన ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేయడంతోపాటు ఒకరికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. రాప్తాడు మండలం గొల్లపల్లి పరిధిలో చేపడుతున్న ఉపాధి పనులను ఫిబ్రవరి 22వ తేదీన సామాజిక తనిఖీ బృందం పరిశీలించింది. 32 మంది ఉపాధి కూలీలు పనిచేస్తుండగా.. 62 మంది హాజరైనట్లు నమోదు చేసిన విషయం గుర్తించింది. దీంతో గొల్లపల్లి గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ బ్రహ్మయ్యను సస్పెండ్ చేశారు. ఫిబ్రవరి 17వ తేదీన ఆత్మకూరు మండలం రంగంపేటలో తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. 33 మంది ఉపాధి కూలీలు పనిచేస్తుండగా.. 35మంది హాజరైనట్లు పట్టికలో నమోదు చేశారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ సుశీలమ్మను సస్పెండ్ చేశారు. ఆత్మకూరులో గతనెల 22వ తేదీన సోషల్ ఆడిట్ టీం క్షేత్రస్థాయి పర్యటనలో ఉపాధి కూలీల నమోదులో జరిగిన అవకతవకలు గుర్తించి, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్‌నాయుడుకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు.



ఉష్ణోగ్రతలు	
గురువారం	
గరిష్ఠం	38.0
కనిష్ఠం	19.0



ఇఫ్తార్	సెహరీ
6.30	5.16
శుక్రవారం సాయంత్రం	శనివారం ఉదయం

నువ్వు రాకుంటే చచ్చిపోతా..!

ప్రియుడికి ఫోన్ చేసి..

సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య



విజయలక్ష్మి (ఫైల్)

అనంతపురం క్రైం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని ఆరో సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ విజయలక్ష్మి(29) ఆత్మహత్య చేసుకున్నారు. ప్రేమ వైఫల్యమే కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఆత్మహత్యకు ముందు ఆమె తన ప్రియుడికి ఫోన్ చేశారని విశ్వసనీయంగా తెలిసింది. 'నువ్వు రా.. లేకుంటే నేను చచ్చిపోతా..' అని ఆమె అన్నట్లు సమాచారం. ఆ తరువాత ఏం జరిగిందోగానీ, తన గదిలో ఉరి వేసుకున్నారు. ఆ తరువాత కాసేపటికి ఆమె ప్రియుడు అక్కడికి వచ్చి కిటికీ అద్దాలను ధ్వంసం చేసి ఆమెను కాపాడే ప్రయత్నం చేశాడు. స్థానికుల సహకారంతో కిందకు దించాలని చూశాడు. కానీ అప్పటికే ఆమె మృతిచెందారు.

'మీరెవరు..?' అని స్థానికులు అడిగితే.. తానూ సచివాలయ ఉద్యోగినే అని చెప్పి ఆమె ప్రియుడు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. ప్రసన్నాయపల్లికి చెందిన విజయలక్ష్మి కొంతకాలంగా అనంతపురం రామచంద్రనగర్‌లో ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఏడాదిన్నర క్రితం తన సోదరి భర్త మృతి చెందడంతో ఆమెకు తోడుగా ఉండేవారని సమాచారం. ఇటీవల ఆమె అద్దె గదిలో ఒంటరిగా ఉంటున్నారు. నార్పల మండల పరిధిలోని ఓ సచివాలయంలో విలేజ్ సర్వేయర్‌గా పనిచేస్తున్న యువకుడితో ఆమె ప్రేమలో ఉన్నట్లు తెలిసింది. పెళ్లి చేసుకోవాలని అతన్ని ఒత్తిడి చేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం అతనికి ఫోన్ చేసి, 'నువ్వు వెంటనే రా.. లేకపోతే చనిపోతా' అని బెదిరించినట్లు సమాచారం. ఆ తరువాత విజయలక్ష్మి తన గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నారు. ఈ ఘటనపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెలవు కావాలని వచ్చి...

విజయలక్ష్మి గురువారం మధ్యాహ్నం నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చినట్లు తెలిసింది. తనకు మూడు నెలలపాటు సెలవు కావాలని కోరినట్లు సమాచారం. ఆ సమయంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో కొంతసేపు వేచి ఉన్నట్లు తెలిసింది. ఆ తరువాత కాసేపటికే విజయలక్ష్మి ఆత్మహత్య చేసుకోవడం అనుమానాలకు తావిస్తోంది. విషయం తెలిసినా నగరపాలక సంస్థ అధికారులుగాని, ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్‌లో ఉన్న మహిళా అధికారులు గాని అటు వైపు కన్నెత్తి చూడకపోవడం చర్చనీయాంశమైంది. త్రీటౌన్ పోలీసులు సైతం ఆత్మహత్యకు కారణాలు ఏమిటో స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. తమకు ఫోన్ ద్వారా విషయం తెలిసిందని, మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ శాంతిలాల్ తెలిపారు.

అనంత వైద్యురాలికి గోల్డ్ మెడల్



స్టేట్ టాపర్ డాక్టర్ వైష్ణవిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు

అనంతపురంటౌన్, మార్చి6(ఆంధ్రజ్యోతి): అనంత వైద్య కళాశాలలో పీజీ చేస్తున్న వైష్ణవి గోల్డ్ మెడల్ సాధించారు. పీజీ వైద్య పరీక్షల్లో స్టేట్ టాపర్‌గా నిలిచి, గోల్డ్ మెడల్‌కు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో గురువారం మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, వైస్ ప్రిన్సిపాళ్లు శంషాద్ బేగం, షారోన్ సోనియా, ప్రొఫెసర్లు డాక్టర్ సుబ్రహ్మణ్యం, మధుసూదన్ తదితరులు టాపర్ వైష్ణవిని సత్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. స్టేట్‌లో అత్యధిక మార్కులు సాధించి టాపర్‌గా నిలిచి గోల్డ్‌మెడల్‌కు ఎంపికవడం హర్షణీయమన్నారు. ఎన్టీఆర్ యూనివర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా వైష్ణవికి గోల్డ్ మెడల్ అందజేస్తారన్నారు.

నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలి

రాయలసీమ రీజియన్ హోంగార్డుల ఇన్‌చార్జి కమాండెంట్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమాండెంట్ మహేష్‌కుమార్

అనంతపురం క్రైం, మార్చి6(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలు మెరుగు పరచుకుని, ప్రజలకు గుణాత్మక సేవలు అందించాలని రాయలసీమ రీజియన్ హోంగార్డుల ఇన్‌చార్జి కమాండెంట్ మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో గురువారం జిల్లాలోని హోంగార్డుల పరేడ్ నిర్వహించారు. పరేడ్‌ను కమాండెంట్ తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధుల్లో అమలు చేయాలన్నారు. ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలన్నారు. అనంతరం దర్బార్ నిర్వహించి హోంగార్డుల సమస్యలను తెలుసుకున్నారు. వాటిని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మధు, ఆర్ఎస్ఐ జాఫర్, హోంగార్డులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పదవి ఎవరికో..?

ఆశావహుల్లో ఒకటే టెన్షన్

(వివరాలు 6లో...)

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వేళైంది. ఏటా పాల్గుణ మాసంలో పక్షం రోజుల రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు మంగళవారం అంకురార్పణ జరగనుంది. బ్రహ్మోత్సవాలను సాక్షాత్తు బ్రహ్మదేవుడు ముందుండి నడిపిస్తారని భక్తుల విశ్వాసం. ఈ నెల 9న ప్రారంభమయ్యే వేడుకలు 23న ముగుస్తాయి. శ్రీవారు రోజుకో అవతారంలో భక్తులను అనుగ్రహిస్తారు.

-ఆంధ్రజ్యోతి, కదిరి

ఖాద్రీశుడి సంబరం



ఖాద్రీ లక్ష్మీనరసింహా స్వామి

మూల విరాట్టు... ప్రత్యేకం

కదిరి నారసింహుడు స్వయంభువు. శ్రీవారు ప్రహ్లాద సమేతుడై గర్భాలయంలో కొలువుదీరారు. అష్టభుజుడైన నారసింహుడు దుష్టరాక్షసుడైన హిరణ్యకశపుడిని తన తొడలపై పరుండబెట్టుకుని.. గోళ్లతో వక్షస్థలాన్ని చీలుస్తూ కనిపిస్తారు. నాలుగు హస్తాలలో శంకు, చక్ర, ఖేద్య, ఖడ్గములను ధరించి ఉంటారు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు శ్రీవారి గర్భాలయానికి ఎడమ భాగాన, మరో ఆలయంలో కొలువుదీరి ఉన్నారు. నిత్యం అభిషేకం అనంతరం శ్రీవారి వక్ష స్థలం నుంచి స్వేద బిందువులు ఉద్భవించడం. మూల విరాట్టు ప్రత్యేకత.



ప్రహ్లాదుల మూల విరాట్టు

9న అంకురార్పణ..
20న తేరు..
బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన స్వామి
పక్షం రోజులు కదిరిలో సందడే సందడి

ఖాద్రి అంటే..

శ్రీమహావిష్ణువు దశావతారాల్లో ఒకటి నారసింహావతారం. కదిరి పట్టణ పూర్వ నామం ఖాద్రీపురం. ఖ అంటే విష్ణు పాదం అని, 'ద్రి' అంటే కొండ అని అర్థం. నారసింహుడు ఈ ప్రాంతంలో పాదం మోపినందున ఖాద్రి అన్న పేరు వచ్చిందని చెబుతారు. ఇదికాక మరో పురాణ గాథ ప్రచారంలో ఉంది. 'ఖదిర' అనే పేరుగల చంద్ర వృక్షం నుంచి నారసింహుడు ఉద్భవించినందున ఈ క్షేత్రానికి ఖాద్రి అన్న పేరు వచ్చిందని అంటారు. కృతయుగంలో ఉద్భవించిన లక్ష్మీనరసింహుడి కోసం పట్నం పాలేగాళ్లు 10వ శతాబ్దానికి ముందే ఆలయాన్ని నిర్మించినట్లు ఆనవాళ్ళు ఉన్నాయి. ప్రస్తుతం నారసింహుడి ఆలయం ఉన్న చోట 10వ శతాబ్దం మధ్య కాలంలో పశ్చిమ చాళుక్య రాజవంశీయులు దుర్గాదేవి ఆలయాన్ని నిర్మించారు. భృగుతీర్థంలో మునిగి ఉన్న ఉత్సవ మూర్తులను వసంత రుతువులో వెలికి తీసి ప్రతిష్ఠించడం వలన శ్రీవారిని వసంత వల్లభుడు అని కూడా పిలుస్తారు. మహాభక్తులైన 12 మంది ఆళ్వార్‌లు రంగ మంటపాన్ని, కొక్కంటి పాలెగాళ్ళు పడమర గోపురాన్ని, తాడిపత్రి పాలెగాళ్ళు కొటాయి మంటపాన్ని నిర్మించారు.

పాప విమోచనం

ఆలయానికి పడమర భాగాన, అర్జుననది ఒడ్డున భృగుతీర్థం ఉంది. అక్కడ భృగు మహర్షి తపస్సు చేసి శ్రీవారిని స్మరించుకున్నారు. ఆ మహర్షి కోరిక మేరకు శ్రీవారు స్వయంగా శ్రీదేవి, భూదేవి సమేత ఉత్సవ విగ్రహాలు అందించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఆ ఉత్సవ విగ్రహాలే ఇప్పటికీ బ్రహ్మోత్సవాల్లో తిరువీధుల్లో భక్తులకు దర్శనమిస్తున్నాయి. భృగుతీర్థంలో స్నానం చేసి శ్రీవారిని దర్శించుకుంటే సర్వపాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం.



పాలబావి

ముహూర్తాలు బంద్



ఖాద్రీ లక్ష్మీనర సింహ స్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణం జరిగిన నాటి నుంచి ఈ ప్రాంతంలో వివాహాలను నిర్వహించరు. ఎందుకు అని ప్రశ్నిస్తే.. 'నారసింహుడి కల్యాణానికి ఎదురు కళ్యాణమా?' అని బదులిస్తారు. అందుకే ముహూర్త బలాలు ఎలా ఉన్నా, బ్రహ్మోత్సవాలు ముగిసేవరకూ ఎవరూ వివాహం చేసుకోరు. స్వామివారి కల్యాణం తరువాతే తమ కల్యాణం గురించి ఆలోచిస్తారు. నారసింహుడిని ఇలవేల్పుగా కొలిచేవారు ఈ పక్షం రోజులపాటు మాంసాహారానికి దూరంగా ఉంటారు.

కదిరి మల్లెల పరిమళాలు



కదిరి మల్లెలకు దేశంలోనే పేరుంది. ఇక్కడి మల్లెల పరిమళం మరే ప్రాంతంలోనూ కనిపించదంటారు. ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాల సమయానికి విరబూసే మల్లెలు మరింతగా గుబాలిస్తాయి. ఇక ఈ ప్రాంతంలో మాత్రమే కన్పించే దవణం, మరువం సౌరభాలు ఖాద్రీశుడికి ఎంతో ప్రీతిపాత్రం. బ్రహ్మరథంలో ఊరేగే శ్రీవారికి దవణాన్ని మొక్కుబడిగా సమర్పిస్తారు. ఇటీవలి కాలంలో కదిరి దవణాన్ని సెంటు, అత్తరు తయారీలో వినియోగిస్తున్నారు.



ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణ గోపురాలు

చూడండి.. కనులారా..

ఖాద్రీ లక్ష్మీనారసింహుడిని దర్శించుకున్న అనంతరం భక్తులు దర్శించుకోవాల్సిన క్షేత్రాలు ఈ ప్రాంతంలో చాలా ఉన్నాయి. కదిరి, రాయచోటి మార్గంలో 12 కి.మీ. దూరంలో గాండ్లపెంట మండలం, కటారుపల్లిలోని యోగివేమన ఆలయం ఉంది. అత్యంత విశాలమైన వటవృక్షంగా గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కిన తిమ్మమ్మ మర్రిమాను కూడా ఇదే మార్గంలో నంబులపూలకుంట మండలం గూటిబైలు వద్ద ఉంది. కదిరి- హిందూపురం రహదారిలో పాలబావి ఉంది. ఎంత కరువు వచ్చినా ఈ బావిలో నీరు ఇంకిపోదు. మండుటెండలో సైతం పొంగిపొర్లడం దీని ప్రత్యేకత. నల్లచెరువు మండలంలోని పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ప్రమాణాలకు పేరు.

అంకురార్పణతో మొదలు

పదిహేను రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాలు అంకురార్పణతో మొదలై తీర్థవాదితో ముగుస్తాయి. కల్యాణోత్సవం నాటి నుంచి ప్రతిరోజూ ఓ ప్రత్యేక వాహనంలో తిరువీధుల్లో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. ఏడాదిలో అన్నిరోజులు ఆలయంలో మాత్రమే దర్శనమిచ్చే శ్రీవారు.. భక్తుల చెంతకే వెళ్లి దర్శనమివ్వడం బ్రహ్మోత్సవాల ప్రత్యేకం. 9న అంకురార్పణం, 10న కల్యాణోత్సవం, 11న హంసవాహనం, 12 సింహ వాహనం, 13న హనుమంత వాహనం, 14న బ్రహ్మగరుడసేవ, 15న శేషవాహనం, 16న సూర్య చంద్రప్రభ, 17న మోహినీ ఉత్సవం, 18న ప్రజాగరుడ సేవ, 19న గజవాహనం, 20న బ్రహ్మరథోత్సవం(తేరు), 21 అలకోత్సవం, 22న తీర్థవాది, 23న పుష్పయాగోత్సవం నిర్వహిస్తారు.



ఆలయంలోని ధ్వజస్తంభం



ఎమ్మెల్సీ పదవిపై టెన్షన్... టెన్షన్..!

ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యంపై సందేహాలు

సామాజిక సమతౌల్యం ఒక్కటే ఆశావహం

త్యాగాలు చేసినవారికి చాన్స్ ఇస్తారా..?

అభ్యర్థుల ప్రకటన శనివారం..?







అనంతపురం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవులపై ఉమ్మడి జిల్లా టీడీపీ నేతలు ఆశలు పెట్టుకున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు కారణంగా సాధారణ ఎన్నికల్లో సీట్లను త్యాగం చేసిన నాయకులు పదవులను ఆశిస్తున్నారు. సామాజికవర్గ సమతుల్యం పాటిస్తే తమకే తప్పనిసరిగా పదవి దక్కుతుందని కొందరు అంచనా వేసుకుంటున్నారు. దశాబ్దాలుగా పార్టీ అభ్యున్నతి కోసం పాటుపడిన నేతలు సైతం ఎమ్మెల్సీ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఏ ప్రాతిపదికన ఎమ్మెల్సీలుగా ఎంపిక చేయాలనే అంశంపై టీడీపీ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. జనసేన నుంచి నాగబాబును శాసనమండలికి పంపాలని ఆ పార్టీ నిర్ణయం తీసుకుంది. దీంతో జనసేనకు ఉమ్మడి జిల్లాలో అవకాశం లేదని తేలిపోయింది. టీడీపీ నుంచి ఎవరికి అవకాశం ఇస్తారనే చర్చ కొనసాగుతోంది. పార్టీ సీనియర్ నాయకులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి, గుండుమల తిప్పేస్వామి, గడ్డం సుబ్రమణ్యం ఎమ్మెల్సీ పదవి ఆశిస్తున్న వారిలో ఉన్నారు. నియోజకవర్గాన్ని త్యాగం చేసిన నాయకుడిని పరిగణనలోకి తీసుకుంటే.. ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌కు అవకాశం ఉంటుంది. సామాజిక వర్గాన్ని పరిగణలోకి తీసుకుంటే బీసీ కోటాలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మైనార్టీ కోటాలో మాజీ ఎంపీ సైపుల్లా తనయుడు కేఎం జకీవుల్లాకు ఎమ్మెల్సీ పదవి దక్కే అవకాశాలుంటాయని ప్రచారం జోరుగా సాగుతోంది. టీడీపీ అధినాయకత్వంత తీవ్రంగా కసరత్తు చేస్తోందని పార్టీ ముఖ్య నాయకుల ద్వారా తెలిసింది. ఎమ్మెల్సీ పదవిని దక్కించుకునేందుకు ఆశావాహులు ఎవరిస్థాయిలో వారు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కొందరు టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబును పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌ను కలిసి తమ అభ్యర్థిత్వాలను పరిశీలించాలని కోరినట్లు తెలిసింది.

ప్రాధాన్యం ఉంటుందా..?

సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గాలను రాష్ట్రంలోని 31 నియోజకవర్గాల నుంచి జనసేన, బీజేపీ అభ్యర్థులు పోటీ చేశారు. ఆ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులు త్యాగాలు చేశారు. వీరికి మొదటి ప్రాధాన్యం ఇచ్చేలా ఉంటే.. ఉమ్మడి జిల్లాకు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పదవి దక్కే అవకాశం ఉంది. కష్టకాలంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేసిన నేతలకే ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలనే యోచనలో పార్టీ అధిష్ఠానం ఉండటం ఆశావాహులను మరింత కలవరపెడుతోంది. సామాజికవర్గాలను పరిగణలోకి తీసుకున్నా.. తమదాకా వస్తుందా అన్న అనుమానాలు ఆశావహుల్లో ఉన్నాయి. అయినప్పటికీ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

సామాజికంగానూ పోటీ..

టీడీపీ అధిష్ఠానం సామాజిక సమతౌల్యాన్ని పరిగణలోకి తీసుకుంటే ఉమ్మడి జిల్లాకు ఎమ్మెల్సీ పదవి దక్కే చాన్స్ ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయినా ఈ అంశం ఆశావహుల్లో ధైర్యాన్ని నింపడం లేదు. సామాజికవర్గాల పరంగా పదుల సంఖ్యలో ఎమ్మెల్సీ పదవి రేసులో ఉండటమే దీనికి కారణం. పార్టీ వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు... సామాజికవర్గాల ఆశావహుల్లో బుద్దా వెంకన్న, బీద రవిచంద్ర, కొమ్మాలపాటి, దేవినేని ఉమ, రెడ్డి సుబ్రమణ్యం, ఏరాసు ప్రతాప్‌రెడ్డి, లింగారెడ్డి, జంగా కృష్ణమూర్తి పేర్లు వినిపిస్తున్నాయి. ఇదివరకూ ఎమ్మెల్సీలుగా పనిసిన బీటీ నాయుడు, పరిచూరి అశోక్‌బాబు మరో చాన్స్ ఇవ్వాలని పార్టీ అధిష్ఠానాన్ని కోరుతున్నారు. మైనార్టీలలో విశాఖకు చెందిన మహమ్మద్ నజీర్ ఉన్నారు. ఇలా అన్ని సామాజికవర్గాల నుంచి ఇద్దరు ముగ్గురేసి నాయకులు ఎమ్మెల్సీ పదవిని ఆశిస్తున్నారు. ఆయా సామాజికవర్గాల్లోని నేతల మధ్య పోటీ నేపథ్యంలో ఏ సామాజికవర్గం నేతను ఎమ్మెల్సీ పదవి వరిస్తుందో తేలేందుకు 48 గంటలపాటు వేచి చూడాల్సిందే. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు శనివారం ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటిస్తారని తెలిసింది. దీంతో ఆశావహులలో టెన్షన్ మరింత పెరిగింది.

మెరిసేదంతా బంగారమే!

జ్యువెలరీ షాపుల్లో మోసాలు

- రాళ్లకూ బంగారంతో సమానంగా ధరలు
- తూకాల్లోనూ తేడాలు
- వేయింగ్ మిషన్ల రెన్యువల్ ఉత్తమాటే..
- వినియోగదారులకు నిండా మోసం
- తనిఖీలు మరచిన తూనికలు, కొలతల అధికారులు



బంగారం ధరలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. ఎంతదాకా పెరుగుతాయో కూడా తెలియదు. దీంతో ఇప్పుడే అంతో ఇంతో బంగారం కొనిపెట్టుకోవాలని చాలామంది ఆరాట పడుతున్నారు. జ్యువెల్లరీ షాపులకు క్యూ కడుతున్నారు. వేలు, లక్షల రూపాయలు పోసి కొన్న బంగారం స్వచ్ఛమైనదేనా, చెల్లించిన డబ్బుకు సరిపోయే తూకం నగ ఇచ్చారా? అన్నది అనుమానమే. చాలా షాపుల్లో బంగారం మాటున రకరకాల మోసాలకు పాల్పడుతున్నారు. రాళ్లతో ఉన్న బంగారు నగలను కొనుగోలు చేస్తే షాపు నిర్వాహకుడు రాళ్లు, బంగారాన్ని వేర్వేరుగా తూకం వేసి, ధర లెక్కగట్టాలి. ఎందుకంటే బంగారం, రాళ్ల ధరకు చాలా వ్యత్యాసం ఉంటుంది. అలా చేయట్లేదు. నగ మొత్తంగా తూకం వేసి బంగారంతో సమానంగా రాళ్లకూ ధర కట్టి వినియోగదారులకు అంటగడుతున్నారు. అర్హత లేని వేయింగ్ మిషన్లతో మోసం చేస్తున్నారు. వాటిని కనీసం రెన్యువల్ చేయట్లేదు. దీంతో జిల్లాలోని కొన్ని షాపుల్లో నిర్వాహకులు చెప్పిందే తూకంగా, ఇచ్చిందే బంగారంగా మారిపోయింది. తరచూ తనిఖీలు చేస్తూ ఈ మోసాలకు చెక్ పెట్టాల్సిన తూనికలు, కొలతల శాఖాధికారులు ఆ విషయాన్నే మరిచారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ శాఖను అధికారులు, సిబ్బంది కొరత కూడా వేధిస్తోందని సమాచారం. వెరసి.. పలు జ్యువెల్లరీ షాపుల్లో వినియోగదారులు మోసపోతున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్

స్వచ్ఛత సంగతేంటో..?

బంగారు నగ కొనుగోలు చేసేందుకు వెళ్తే దుకాణ నిర్వాహకుడు చెప్పిన మేరకే స్వచ్ఛత అని వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. అది 22 క్యారెట్లా, 24 అని వినియోగదారులు గుర్తించలేకపోతున్నారు. పలు దుకాణదారులు తూకాల్లో చేస్తున్న మోసాన్ని గ్రహించలేకపోతున్నారు. వినియోగదారులకు బంగారంపై ఉన్న మక్కువను క్యాష్ చేసుకుంటున్న కొందరు కేటుగాళ్లు తక్కువ తూకాలతో వారి జేబు గుల్ల చేస్తున్నారు. ఇలాంటి బంగారు దుకాణాలపై నిత్యం తనిఖీలు నిర్వహించి, చర్యలు తీసుకోవాల్సిన తూనికలు, కొలతల శాఖాధికారులు ఆ విషయాన్నే మరిచారు. ఆ శాఖలో ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నట్లు తెలుస్తోంది.




బంగారం దుకాణంలో నగలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

గుర్తించకపోతే అంతే...

సాధారణంగా బంగారు దుకాణాల్లో మిల్లీ గ్రాముల నుంచి వెయిట్ చూపించే యంత్రాలుండాలి. అలాంటివి జిల్లాలో అతి తక్కువ దుకాణాల్లో మాత్రమే దర్శనమిస్తున్నాయి. ఫలితంగా చిన్నపాటి బంగారు నగలు కొనుగోలు చేసే వినియోగదారులు మోసపోతున్నారు. మెజార్టీ దుకాణాల్లో 10 మిల్లీ గ్రాముల నుంచి మొదలయ్యే యంత్రాలను వినియోగిస్తున్నారు. తద్వారా వినియోగదారులకు తూకాలు అర్థంకాకుండా మోసాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో 24 క్యారెట్ల బంగారు నగలు తీసుకున్న వారికి... వారివద్దనున్న నకిలీ యంత్రాలతో అవి 22 క్యారెట్లు బంగారు నగలని తెలుసుకోలేకపోతున్నారు. తూకాల్లో గ్రాము నుంచి 1.50 గ్రాముల వరకు బంగారాన్ని తక్కువ ఇస్తున్నట్లు సమాచారం. మోసాలకు పాల్పడుతున్న దుకాణాలపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు ఉదాసీనతతో వ్యవహరిస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు. దీంతో దుకాణదారులు ఆడిందే ఆట... పాడిందే పాటగా మారిందనడంలో సందేహం లేదు.

రాళ్ల బంగారంతో జర జాగ్రత్త...

చాలా మంది... రాళ్ల బంగారంపై ఎక్కువ మక్కువ చూపుతుంటారు. చేతి ఉంగరాలు, చైన్ లాకెట్‌లు, నక్లెస్ తదితరాలను రాళ్లతో తయారు చేయించుకుంటుంటారు. బంగారం ధర, స్టోన్ ధరల్లో చాలా వ్యత్యాసాలున్నాయి. కొంత మంది బంగారు దుకాణదారులు దీనిని క్యాష్ చేసుకుంటూ వినియోగదారులను మోసం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎవరైనా రాళ్లతో ముడిపడిన బంగారు నగలను కొనుగోలు చేస్తే... బంగారం, రాళ్లను వేర్వేరుగా తూకం వేయాలి. వాటి ధరలను బిల్లుల్లో సైతం వేర్వేరుగా చూపించాల్సి ఉంటుంది. 10 గ్రాముల స్టోన్ కలిగిన ఉంగరం తీసుకుంటే... అందులో దాదాపు ఒక మిల్లీ గ్రాము స్టోన్ ఉంటే... కొందరు కేటుగాళ్లు మొత్తం 10 గ్రాములు బంగారం ధరకే అమ్మేస్తున్నట్లు సమాచారం.



తూనికలు, కొలతల శాఖ కార్యాలయం

వేయింగ్ మిషన్ల రెన్యువల్ సంగతేంటో..?

సాధారణంగా బంగారం దుకాణాలు నిర్వహిస్తున్న ప్రతిఒక్కరూ తమ వద్ద ఉన్న వేయింగ్ మిషన్లకు తూనికలు, కొలతల శాఖ నుంచి రెన్యువల్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా తీసుకోవాలి. అధికారులు.. ఆ మిషన్‌ను పరిశీలించి తక్కువ తూకాలన్నా.. ఏదైనా సమస్యఉన్నా సరిచేసి, రెన్యువల్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. కొంతమంది ఆ శాఖ ఇచ్చే రెన్యువల్ సర్టిఫికెట్లను తీసుకోకుండానే వ్యాపారాలు సాగిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఎన్ని బంగారు దుకాణాలున్నాయి, ఎంతమంది రెన్యువల్ సర్టిఫికెట్లు తీసుకున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. కొన్ని బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల విషయానికొస్తే వారు ఆడిందే ఆట... పాడిందే పాట అ న ౨ చందంగా తయారైందనే చెప్పాలి. ఫైనాన్స్ సంస్థల్లోకి బంగారు నగలను తాకట్టు పెట్టుకునేందుకు వెళ్తే... వారు వేసిన తూకం... ఇచ్చే డబ్బు తీసుకుని రావాల్సిందేనన్న బాధితులు వాపోతున్నారు. కొందరు ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకు నిర్వాహకులు వేయింగ్ మిషన్లలో తక్కువ తూకాలు నమోదు చేసుకుని, వినియోగదారులను మోసం చేస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఆ ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకులు, బంగారం దుకాణాల్లో వేయింగ్ మిషన్లకు రెన్యువల్ సర్టిఫికెట్లు తీసుకున్నారా, లేదా అని పరిశీలించాల్సిన తూనికలు, కొలతల శాఖాధికారులు పట్టించుకోవట్లేదన్నది బహిరంగ రహస్యమే. కార్యాలయానికి వచ్చిన వారికి మాత్రమే సర్టిఫికెట్లు జారీ చేస్తూ తమ పనైపోయిందని అధికారులు భావిస్తుండటంతో మోసాలకు అడ్డకట్ట వేయలేకపోతున్నారనడంలో సందేహం లేదు.



తూనికలు, కొలతల శాఖ కార్యాలయం వద్దకు వేయింగ్ మిషన్ల రెన్యువల్‌కు వచ్చిన నిర్వాహకులు (ఫైల్)

తనిఖీలు చేస్తున్నాం..

బంగారం దుకాణాల్లో నిత్యం తనిఖీలు చేస్తున్నాం. పలుచోట్ల షాపుల్లో బంగారం, స్టోన్ ధరలు సెపరేటుగా వేయకపోవడాన్ని గుర్తించి, జరిమానాలు విధించాం. ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. శాఖలో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే.

-మహమ్మద్ గౌస్, ఇన్‌స్పెక్టర్, తూనికలు కొలతల శాఖ

ఫైనాన్స్ సంస్థల వేధింపులు

భరించలేకున్నాం..

పోలీసులను ఆశ్రయించిన మహిళలు



పోలీసు స్టేషన్‌లో గోడు చెప్పుకుంటున్న బాధిత మహిళలు

సోమందేపల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల వేధింపులు భరించలేకపోతున్నామనీ, రక్షణ కల్పించాలని గురువారం బాధిత మహిళలు.. పోలీసులను ఆశ్రయించారు. మండల కేంద్రంలో చేనేత కార్మికులు అధికంగా నివసిస్తున్నారు. వీరి అవసరాలను ఆసరాగా చేసుకుని, ప్రైవేటు మైక్రో ఫైనాన్స్ సంస్థలు గ్రూపు ష్యూరిటీ పేరుతో 10వేల నుంచి రూ.40 వేలదాకా రుణాలిచ్చారు. పది మంది మహిళలను గ్రూపుగా చేసి, రుణాలు మంజూరు చేశారు. తర్వాత రుణాల వసూలు పేరుతో వేధిస్తున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పనులు లేవనీ, అప్పులు చెల్లించడానికి మూడు నెలలు గడువివ్వాలని కోరినా బాగేపల్లికి చెందిన ఫైనాన్స్ సంస్థ మేనేజర్ రంజిత్, ఉద్యోగి గంగరాజు ససేమిరా అంటున్నారని వాపోయారు. రుణం చెల్లించేందుకు గడువు ఇప్పించాలని పోలీసులను కోరారు. విషయం బయటకు పొక్కడంతో ఫైనాన్స్ సంస్థ దిగొచ్చింది. రెండు నెలలు మాత్రమే వ్యవధి ఇస్తామనీ, అప్పటికీ చెల్లించకపోతే ఇళ్లు జప్తు చేస్తామని బెదిరించినట్లు బాధిత మహిళలు శోభ, సుమతి, రాధ, మంజుల, ప్రమీళమ్మ, శాంతమ్మ, సాయిలక్ష్మి తెలిపారు. ఫైనాన్స్ సంస్థ ప్రతినిధుల ఒత్తిళ్లు భరించలేక కొందరు ఊరు వదిలి పారిపోయినట్లు వారు వాపోయారు. ఈ బెదిరింపులు ఇలా కొనసాగితే తమకు ఆత్మహత్యలే శరణ్యమని మహిళలు ఆవేదన చెందారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు ఏపీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కన్వీనర్ విజయలత గురువారం ప్రకటనలో తెలిపారు. గుత్తి, నూతిమడుగు బాలుర గురుకులాలు, గార్లదిన్నె మైనార్టీ బాలుర వసతి పాఠశాలల్లో ఐదో తరగతిలో 80, ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లో మిగిలిన సీట్లకు ఈనెల 31వ తేదీలోపు ఉమ్మడి జిల్లాలో అర్హతగల విద్యార్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 25వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆమె తెలిపారు.

కొడిగెనహళ్లిలో..

పరిగి: మడలంలోని కొడిగెనహళ్లి గురుకుల ప్రతిభా పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెచ్‌ఎం, ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్ మురళీధర్‌బాబు తెలిపారు. నెలాఖరులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 80 సీట్లకు రాయలసీమతోపాటు నెల్లూరు జిల్లాలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఏప్రిల్ 25న పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు 8712625065 నంబరులో సంప్రదించాలన్నారు.

ఇంటర్మీడియట్ ప్రవేశానికి..

మడకశిర రూరల్: మహాత్మ జ్యోతిబాఫూలే గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రవేశానికి ఈనెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ రమాదేవి తెలిపారు. బాలికలకు టేకులోడు, గుడిబండ, బాలురకు గుండుమల, లేపాక్షి కళాశాలల్లో సీట్లు ఉన్నాయన్నారు.

ఆవుల కంటెయినర్ పట్టివేత



గాంధీ సర్కిల్ వద్ద నిలిపిన కంటైనర్ వాహనం

గుత్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నుంచి బెంగళూరుకు అక్రమంగా ఆవులను తరలిస్తున్న కంటెయినర్‌ను గుత్తి పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. పోలీసులు రాగానే డ్రైవర్, క్లీనర్ వాహనం వదిలి పారిపోయారు. మంత్రాలయం వైపు నుంచి బెంగళూరుకు కంటైనర్ వాహనంలో ఎద్దులు, ఆవులను తరలిస్తున్నట్లు వెనుక వాహనంలో వస్తున్న కర్ణాటక వాసి అమృతజయరాం గమనించారు. డయల్ 100కు ఆమె సమాచారం ఇచ్చారు. గుత్తి పట్టణంలోకి కంటైనర్ రాగానే గాంధీ సర్కిల్ వద్ద ఆమె అడ్డుకున్నారు. వెంటనే పోలీసులు రావడంతో డ్రైవర్, క్లీనర్ పారిపోయారు. కంటైనర్‌లో దాదాపు 20 మూగజీవాలు ఉన్నట్లు సమాచారం. ఓ న్యూస్ చానల్ నిర్వాహకురాలైన అమృత జయరాం.. ఆవుల అక్రమ తరలింపుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బీజేపీ నాయకుడు తిమ్మారెడ్డి తదితరులు ఆమెకు మద్దతుగా సీఐ వెంకటేశ్వర్లును కలిశారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న అమృత జయరాం

అన్న హత్యకు తమ్ముడి సుపారీ

- అన్న కొడుకుని కూడా చంపేయాలని ఒప్పందం
- హత్యల కుట్ర భగ్నం
- ఇద్దరు నిందితుల అరెస్టు
- వేటకొడవళ్లు, నగదు స్వాధీనం



నిందితులతో పోలీసులు

రాయదుర్గం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆస్తి పంపకాల వివాదం, చెప్పుతో కొట్టారన్న అవమానంతో సొంత అన్న, అతడి కుమారుడిని హత్య చేసేందుకు తమ్ముడే సుపారీ ఇచ్చాడు. అడ్వాన్సు ఇవ్వడంతోపాటు హత్యకు అవసరమైన వాటిని సమకూర్చారు. దీనిపై ఉప్పందుకున్న రాయదుర్గం పోలీసులు.. హత్యల కుట్రను భగ్నం చేశారు. ఇద్దరు నిందితులతోపాటు వేటకొడవళ్లు, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం సాయంత్రం సీఐ జయనాయక్ స్థానిక స్టేషన్‌లో వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రంలోని చిత్రదుర్గ జిల్లా మొలకాల్మూరు తాలూకా కెరెకొండాపుర గ్రామానికి చెందిన మురారి దామోదర్‌గౌడ్, అతడి అన్న మధుసూదన్ గౌడ్ మధ్య ఆస్తి వివాదం ఉంది. తల్లిదండ్రుల ఆస్తి 12 ఎకరాల్లో నాలుగెకరాల తోటను మధుసూదన్‌కు, మరో నాలుగెకరాల వర్షాధార భూమిని అక్క సుస్మితకు, మిగిలినది దామోదర్ గౌడ్‌కు పంచారు. అలాగే మధుసూదన్‌కు తల్లి పేరుతో ఉన్న నాలుగు సెంట్ల స్థలంతోపాటు అందులో నిర్మించిన ఇంటిని కూడా వాటా కింద ఇచ్చారు. తండ్రి కర్ణాటకలోని రాంపుర గ్రామంలో ఎకరా భూమిలో ప్లాట్లు వేసి, అమ్మగా మిగిలిన వాటిలో నాలుగు ప్లాట్లు తల్లి పేరుతో ఉన్నాయి. వాటిలో దామోదర్‌గౌడ్ కాంప్లెక్స్ కట్టాలని నిర్ణయించుకున్నాడు. ఆ దిశగా అన్న మధుసూదన్ ఇంటికెళ్లగా.. వదిన సుగుణ, వారి కొడుకు భార్గవ్‌తో గొడవ జరిగింది. దీంతో దామోదర్ గౌడ్‌పై అన్నతో పాటు అతడి కుమారుడు, వదిన కలిసి చెప్పుతో దాడి చేసి, అవమానపరిచారు. దీనిని మనసులో పెట్టుకున్న దామోదర్‌గౌడ్ అన్న, అతడి కుమారుడిని చంపించాలనుకున్నాడు. అపుడు వారి ఆస్తి కూడా తనకు దక్కుతుందనుకున్నాడు.

రాయదుర్గం మండలంలోని మెచ్చిరి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గొల్ల ఆదికేశవులు హత్యలో నిందితుడుగా ఉన్న మూడుముళ్ల మారుతీ రెడ్డిని దామోదర్ గౌడ్ సంప్రదించాడు. అన్న, అన్న కొడుకును హతమార్చేందుకు రూ.23 లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. రూ.మూడు లక్షలు అడ్వాన్స్ కింద ముట్టజెప్పాడు. కుట్ర విషయం తెలుసుకున్న పోలీసులు పల్లేపల్లి గేటు వద్ద కారులో ఉన్న దామోదర్ గౌడ్, మారుతీరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. మధుసూదన్ గౌడ్, భార్గవ్‌ను కారులో కిడ్నాప్ చేసి, ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో చంపి, శవాలను పడేయాలని కుట్ర పన్నారు. అమలు చేసే ప్రయత్నంలో ఉండగా పోలీసులు భగ్నం చేశారు. నిందితుల నుంచి రూ.మూడు లక్షల నగదు, మూడు వేటకొడవళ్లు, రెండు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జయనాయక్ వివరించారు.

మార్కెట్‌కు 500 టన్నుల చీనీ దిగుబడులు

అనంతపురం రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి):అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లోని చీనీ మార్కెట్‌కు 500టన్నులకు పైగా చీనీ ఉత్పత్తులు వచ్చాయి. సీజన్ ప్రారంభంకావడంతో మార్కెట్‌కు కాయలు రావడం పెరుగుతోంది. బుధవారం 401టన్నుల కాయలు మార్కెట్‌కు రావడం జరిగింది. గురువారం కూడా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మార్కెట్‌కు 572టన్నుల చీనీ కాయలు రావడం జరిగింది. అధికారులు ఈనామ్ పద్ధతిలో వేలం నిర్వహించారు. గరిష్ఠంగా టన్ను రూ.24,500, సరాసరి ధర రూ.14వేలు, కనిష్ఠ ధర రూ.7వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

ఆర్ఐ మున్వర్ సస్పెన్షన్

కదిరి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఓడీసీ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షేక్ మున్వర్‌బాషాను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. గతంలో ఆయన కదిరి మండల ఆర్‌ఐగా పనిచేసినపుడు వివిధ భూ కుంభకోణాలతో సంబంధం ఉన్నట్లు కదిరి పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. దీంతో ఉన్నతాధికారులు ఆర్ఐ మున్వర్‌ను సస్పెండ్ చేస్తూ ఈనెల 4న ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ సమయంలో అధికారులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

బాధ భరించలేం..!

- జిల్లా కేంద్రంలో కానరాని డయాలసిస్ సెంటర్
- కిడ్నీ పేషెంట్లకు తప్పని అవస్థలు
- దూర ప్రాంతాలకు వెళ్లి రావడానికి తీవ్ర ప్రయాస
- పుట్టపర్తిలో ఏర్పాటు చేయాలంటున్న బాధితులు



పుట్టపర్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో డయాలసిస్ సెంటర్ లేకపోవడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఏర్పడి మూడేళ్లు గడిచినా డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయకపోవడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రం పరిసర మండలాల రోగులు ఇతర ప్రాంతాలకు డయాలసిస్ కోసం వెళ్లాల్సి వస్తోంది. ఇలా వారంలో మూడు రోజులు వెళ్లి రావడం చాలా ఇబ్బందిగా ఉందని, ఈకష్టం పగవాడికి కూడా వద్దని వారు వాపోతున్నారు. జిల్లాలో ధర్మవరం, హిందూపురం, కదిరి ఏరియా ఆస్పత్రులలో మాత్రమే డయాలసిస్ సెంటర్లు ఉన్నాయి. జిల్లా కేంద్రం, పక్క మండలాల్లో 50 మంది వరకు డయాలసిస్ పేషెంట్లు ఉన్నట్లు సమాచారం. జిల్లా కేంద్రంలోనే 20 మంది వరకు పేషెంట్లు ఉంటున్నట్లు తెలిసింది. వీరిలో ఎక్కువ మంది కదిరి ఆస్పత్రికి వెళ్తున్నారు. జిల్లా కేంద్రంలోనే డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

భారంగా మారింది: ప్రభాకర్, కుమ్మరపేట, పుట్టపర్తి



కూల్‌డ్రింక్స్ అమ్ముకుంటూ కూల్‌గా సాగిపోతున్న నా జీవితంలో కిడ్నీల సమస్య పెనుభూతంగా మారింది. దీంతో బతుకు భారంగా మారింది. కూల్ డ్రిక్స్ కొనేవారు లేక ఆదాయం లేకుండా పోయింది. 60 ఏళ్ల వయస్సులో వారానికి మూడుసార్లు కదిరి ఆస్పత్రికి వెళ్లి డయాలసిస్ చేయించుకోవాల్సి వస్తోంది. ఆస్పత్రికి బస్సులో వెళ్లిరావడం ఎంతో కష్టంగా ఉంది.

నాలుగేళ్లుగా..: పాలగిరి రాజు, వెంగలమ్మచెరువు, పుట్టపర్తి మండలం



మార్కెటింగ్‌లో పనిచేస్తూ సాఫీగా సాగుతున్న జీవితంలో ఉన్నఫలంగా కిడ్నీ సమస్య వచ్చింది. కిడ్నీలు రెండూ పాడైపోవడంతో జీవితంలో అంధకారం అలుముకుంది. నాలుగు సంంవత్సరాలుగా వారానికి మూడుసార్లు కదిరి ఆస్పత్రిలో డయాలసిస్ చేసుకుంటున్నాం. రాను పోనూ చార్జీలతో కష్టంగా ఉంది. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తే మా కష్టాలు తీరుతాయి.

పింఛన్ సొమ్ము పెంచాలి: తిరుపాలు, ప్రశాంతి గ్రామం, పుట్టపర్తి



కప్పలబండలో వాటర్‌మన్‌గా పనిచేస్తుండగా కిడ్నీల సమస్య వచ్చింది. దీంతో ఉద్యోగం పోయింది. పనిచేయలేను. నడవలేను. కడుపు నొప్పితో బాధపడుతున్నా. ఇల్లు గడవడం కష్టంగా మారింది. ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ రూ.10వేలు వారానికి మూడు సార్లు డయాలసిస్‌కు, మందులకు చాలడం లేదు. పింఛన్ సొమ్ము మరింత పెంచాలి.

వారానికి మూడుసార్లు: చిన్న అరుణమ్మ, పుట్టపర్తి



డయాలసిస్ కోసం వారానికి మూడుసార్లు 40 కిలోమీటర్ల దూరంలోని ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది. అసలే రోగం.. ఆపై బస్సులో ప్రయాణంతో మరింత ఇబ్బందిగా ఉంది. 8నెలలుగా డయాలసిస్‌తో ఇబ్బంది పడుతున్నా. జిల్లా కేంద్రంలోనే డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తే కొంత బాధ తగ్గుతుంది.

ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో... ఫైరోజ్ బేగం, డీంఅండ్‌హెచ్‌ఓ



జిల్లా కేంద్రంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయడానికి ఒకప్రైవేటు సంస్థ ముందుకొచ్చింది. ఇందుకోసం ప్రయత్నాలు సాగుతున్నాయి. కొత్తచెరువులో నూతన భవనం నిర్మాణంలో ఉంది. భవనం పూర్తి అయిన వెంటనే డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి నివేదికలు పంపాం.

కంచేలు..!

- పొలాల్లో లేఅవుట్లు
- అనుమతులు లేకుండానే ప్లాట్ల విక్రయాలు
- ప్రభుత్వ ఖజానాకు భారీ గండి
- చోద్యంచూస్తున్న అధికారులు



నేమకల్లు గ్రామ సమీపాన పొలాల్లో వేసిన లేఅవుట్

బొమ్మనహాళ్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పంట చేలకు కంచెలు వేస్తున్నారు. లేఅవుట్లుగా మార్చి ప్లాట్లు విక్రయిస్తున్నారు. పంచాయతీ అప్రూవల్ తీసుకోకుండా, నిబంధనలకు తిలోదకాలిస్తూ రియల్టర్లు లేఅవుట్లు వేస్తున్నారు. వాటిని విక్రయించి, జేబులు నింపుకుంటున్నారు. రాజకీయ అండతోనే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ అనుమతులు తీసుకోకపోవడంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది. ఈ తంతు పబ్లిక్‌గానే సాగుతున్నా.. అడ్డుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. బొమ్మనహాళ్ మండలం బళ్లారికి సమీపంలో ఉండడం, ప్రధాన రహదారికి పక్కనే ఉండడంతో ఈ ప్రాంతంలో భూములకు డిమాండ్ పెరిగింది. బళ్లారి, కణేకల్లు ప్రాంతాలకు చెందినవారు మండలంలో స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. దీనిని రియల్టర్లు సొమ్ము చేసుకుంటున్నారు.

నిబంధనలు తూచ్

గ్రామీణ ప్రాంతాల్లో అనధికారిక లేఅవుట్లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. రియల్టర్లు అందులో నిబంధనలు పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్ల ఏర్పాటు, ఖాళీ స్థలాలు వదిలి పెట్టడం మానేస్తున్నారు. నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమిలో ప్లాట్లు వేసి, విక్రయించాలంటే ముందుగా అనుమతులు తీసుకోవాలి. వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకోవాలి. పంచాయతీకి పన్నులు చెల్లించాలి. లేఅవుట్‌లో నిబంధనల మేరకే రోడ్లు ఏర్పాటు చేయాలి. ప్రజా అవసరాలకు ఖాళీ స్థలం సైతం వదలాల్సి ఉంటుంది. మండలంలోని ఉద్దేహాళ్, నేమకల్లు గ్రామాల పరిధిలో అనుమతులు లేకుండా లేఅవుట్లు వేశారు. ఉద్దేహాళ్ బాగా రద్దీ ఉండే గ్రామం కాగా.. నేమకల్లు ప్రసిద్ధిచెందిన ఆంజనేయస్వామి కొలువైన క్షేత్రం. ఈ నేపథ్యంలో రెండు గ్రామాల పరిధిలో స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. బళ్లారి, కణేకల్లు ప్రాంతాలకు చెందిన రియల్టర్లు మండలంలో భూములను కొనుగోలు చేసి, లేఅవుట్లుగా మార్చేస్తున్నారు. ఉద్దేహాళ్ ప్రధాన రహదారి పక్కనే రోడ్డుకు ఆనుకుని రాళ్లు పాతి లేఅవుట్ వేశారు. నేమకల్లు గ్రామంలో పంట భూమిని కొనుగోలు చేసి, ప్లాట్లు వేసి, విక్రయిస్తున్నారు. పంచాయతీ అధికారులకు ఈ వ్యాపారంపై తెలిసినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

రాజకీయ నాయకుల సిఫార్సులు, ఒత్తిళ్లతో గ్రామాల్లో అక్రమ లేఅవుట్లు వెలుస్తుండడంతో పంచాయతీ ఆదాయానికి భారీగా గండిపడుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనుమతులులేని లేఅవుట్లలో ఇంటి స్థలాలు కొనుగోలు చేయడం ద్వారా భవిష్యత్తులో ఆయా పంచాయతీల ఆధ్వర్యంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉండదు. విద్యుత్ సౌకర్యం కూడా కల్పించరు.

చర్యలు తీసుకుంటాం

గ్రామీణ ప్రాంతాల్లో అనుమతులు లేకుండా లేఅవుట్లు వేస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఉద్దేహాళ్ గ్రామంలో లేఅవుట్లు వేసిన వ్యాపారికి నోటీసులు జారీ చేశాం. నేమకల్లు గ్రామంలో వేసినవారికి కూడా నోటీసులు పంపించి, పంచాయతీకి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

- దాస్, ఈఓపీఆర్డీ, బొమ్మనహాళ్



ఉద్దేహాళ్ గ్రామంలో వేసిన అనధికార లేఅవుట్

న్యూస్ బాక్స్

మలోబులేశుడి ఉత్సవాలపై సమీక్ష

ఆత్మకూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంపనూరు కొండపై శనివారం నుంచి ఈ 15 వరకు లక్ష్మీనరసింహస్వామి (మలోబులేశు స్వామి) బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని స్థానిక తహసీల్దార్ లక్ష్మీనాయక్ పేర్కొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి దాస్ ఆధ్వర్యంలో గురువారం మండల అధికారులు ఆలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ లక్ష్మీనరసింహులు, ఈఓ బాబు, ఏఈ దాస్, టీడీపీ నాయకులు రాజారమేష్,వెంకటేసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

9న ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

రామగిరి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఈనెల 9వ తేదీన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీఆంజనేయస్వామి సేవా సమితి సభ్యులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా శుక్ర, శని వారాల్లో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9న ఉదయం విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం నిర్వహిస్తామన్నారు. నూతనంగా నిర్మించిన ఆలయాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాలశ్రీరామ్, సీనియర్ నాయకులు ఎల్ నారాయణచౌదరి చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

రామగిరి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ డెవలెప్‌మెంట్ కాలేజ్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు స్కిల్ డెవలెప్‌మెంట్ కాలేజ్ మేనేజర్ నాగేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఇంటర్, ఐటీఐ చదువుకున్న నిరుద్యోగులు అర్హులన్నారు. నాలుగు నెలలపాటు ఉచిత శిక్షణ, భోజనం, వసతి కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తి అయిన తరువాత సర్టిఫికెట్‌తో పాటు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.

రేపు రాతిదూలం లాగుడు పోటీలు

రాప్తాడు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లిలో ఎర్రితాతస్వామి పరుష సందర్భంగా శనివారం దేశవాళి వృషభాలకు రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ. 20 వేలు, మూడో బహుమతి రూ. 15 వేలు, నాలుగో బహుమతి రూ. 10 వేలు అందజేస్తామన్నారు. రాతి దూలం పోటీల సందర్భంగా ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివరాలకు 9652411408, 9885082915 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పెరటితోటల పెంపకంపై అవగాహన

అనంతపురం రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పెరటితోటల పెంపకంపై గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులు, మల్బరీ సహాయకులు, బహుళార్థ వ్యవసాయ విస్తరణ అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం కృషి భవన్ అనంతపురం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని వారికి సంబంధిత అధికా రులు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డీఆర్‌సీ డీడీ మద్దిలేటి వివిధ పంటలకు ఆశించు చీడపీడలు, తెగుళ్లు, పెరటి తోటల పెంపకం పై తెలియజేశారు. ఏడీ రవి మాట్లాడుతూ... వ్యవసాయ యాంత్రీకరణ గురించి వివరించారు. డివిజన్ పరిధిలోని ఏఓ లు శశికళ, సోమశేఖర్, శ్యాంసుందర్‌రెడ్డి, సుచరిత, విజయ కుమార్, డీఆర్‌సీ ఏడీఏ శైలాకుమారి, ఏఓ రూమానబేగం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు 500 టన్నుల చీనీ దిగుబడులు

అనంతపురం రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు 500 టన్నులకుపైగా చీనీ ఉత్పత్తులు వచ్చాయి. సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్‌కు కాయలు రావడం పెరుగుతోంది. బుధవారం 401 టన్నులు వచ్చాయి. గురువారం కూడా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 572టన్నులు వచ్చాయి. అధికారులు ఈ-నామ్ పద్ధతిలో వేలం నిర్వహించారు. గరిష్ఠంగా టన్ను రూ.24,500, సరాసరి ధర రూ. 14వేలు, కనిష్ఠ ధర రూ.7వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


ఎగ్గిడి లోకేష్ (ఫైల్)

ఆత్మకూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఎగ్గిడి లోకేష్(20) అనే యువకుడు కడుపు నొప్పి తాళలేక గురువారం గ్రామ సమీపాన చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆత్మకూరుకు చెందిన ఎగ్గిడి పెద్దన్న, శివమ్మ దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు లోకేష్ ఉన్నారు. ఎగ్గిడి లోకేష్ కొంత కాలంగా కడుపు నొప్పితో బాధ పడుతుండేవాడని తండ్రి పెద్దన్న తెలిపాడు. ఇంట్లో భోజనం చేసి బయటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడని, అయితే చెట్టుకు ఉరివేసుకుని కన్పించాడని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బిల్డింగ్ నుంచి పడి వాచ్‌మన్ మృతి

అనంతపురం క్రైం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కొత్తగా నిర్మిస్తున్న ఓ బిల్డింగ్ మీద నుంచి పడి ఓ వాచ్‌మన్ మృతి చెందాడు. కణేకల్లు మండలం యర్రగుంటకు చెందిన వడ్డే తిమ్మన్న(54) కొన్నేళ్ల క్రితం నగర శివారులోని నందమూరినగర్‌లో నివాసముంటున్నాడు. వాచ్‌మన్‌గా పనిచేసే అతడు బళ్లారి రోడ్డులో కొత్తగా కడుతున్న బిల్డింగ్‌కు వాచ్‌మన్‌గా ఉన్నాడు. బుధవారం ఉదయం రెండో అంతస్తు నుంచి ఆ బిల్డింగ్‌కు నీళ్లు పడుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. అతడిని ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు సంతానం. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూర్ఛవ్యాధితో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

అనంతపురం క్రైం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్‌కు మూర్ఛ వ్యాధి రావడంతో కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మరువకొమ్మకాలనీకి చెందిన చాకలి ముత్యాలు(40) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం నగరంలోని అశోక్‌నగర్‌లో వెళ్తుండగా హరిహర టెంపుల్ సమీపంలోకి వెళ్లగానే మూర్ఛ రావడంతో కిందపడిపోయాడు. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అదే సమయంలో ట్రాక్టర్ వెనక్కు వెళుతుండగా... స్థానికుడు దానిపైకి ఎక్కి ఆపాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు అవగాహన

అనంతపురం క్రైం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవం సందర్భంగా కొన్ని పాఠశాలల విద్యార్థులకు నగరంలోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కల్పించారు. బాలికలు, మహిళల రక్షణ కోసం మహిళా పోలీస్ డెస్క్ ఎలా పనిచేస్తుంది..?, ఆపద సమయంలో పోలీసుల సహాయం ఎలా తీసుకోవచ్చు తదితర విషయాలపై సీఐ సాయినాథ్.. విద్యార్థులకు వివరించారు. ఎస్ఐ విజయభాస్కర్ నాయుడు, మహిళా కానిస్టేబుల్ గ్లోరీ పాల్గొన్నారు.

స్కావెంజర్ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి

● కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మ్యాన్‌హోల్ స్కావెంజర్ చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సమాజంలో మార్పుకోసం విజిలెన్స్ కమిటీ సభ్యులు కృషిచేయాలని సూచించారు. ఇప్పటికీ మ్యాన్‌హోల్‌లోకి మనషులను దించుతున్నారని, అలాచేసిన అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఇంతకు మునుపు నోటీసులు ఇచ్చారన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పారిశుధ్య కార్మికుల కోసం ప్రత్యేకంగా వైద్య శిబిరాలు నిర్వహించి, అవసరమైన మందులు అందించాలని వైద్యశాఖాధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులతో మాట్లాడి పారిశుధ్య కార్మికులకు అవసరమైన సామగ్రి అందించేందుకు కృషిచేయాలని అధికారులను ఆదేశించా రు. జీతాలు సకాలంలో అందేలా ఆయా శాఖలు చూడాలన్నారు. కార్యక్ర మంలో సోషల్ వెల్ఫేర్ జేడీ రాధిక, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, డ్వామా పీడీ సలీమ్‌బాషా, ఎల్‌డీఎం నర్సింగరావు, డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీ దేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి

అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని శనివారం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఆయన గురువారం కలెక్టరేట్ వద్ద ఉన్న బాలసదన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడారు. మహిళా దినోత్సవాలను జేఎన్‌టీయూ ఆడిటోరియంలో నిర్వహించాలని నిర్ణయించామన్నారు. అక్కడ అవసరమైన ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ మలోల, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి రామక్రిష్ణారెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, ఎల్‌డీఎం నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటికి ఎమ్మెల్యే పరిటాల సునీత శుభాకాంక్షలు


ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా విజయం సాధించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఎమ్మెల్యే పరిటాల సునీత శుభాకాంక్షలు తెలిపారు. గుంటూరు నగరంలోని ఆయన నివాసంలో గురువారం ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కూటమి బలపర్చిన అభ్యర్థిగా బరిలో నిలిచి, అఖండ మెజార్టీతో గెలిచారని కొనియాడారు.

వేసవిలో నీటి ఎద్దడి రానీయకండి : ఎస్ఈ

అనంతపురం న్యూటౌన్, మార్చి6 (ఆంధ్రజ్యోతి) వేసవిలో నీటి ఎద్దడికి తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్.. అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కార్యాలయంలోని సమావేశ భవనంలో గురువారం జిల్లాలోని ఏఈలు, డీఈలు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, నీటి ఎద్దడి తలెత్తే ప్రాంతాలను గుర్తించాలన్నారు. ప్రత్యామ్నాయ చర్యలకు నివేదికలు పంపాలన్నారు. సమావేశంలో ఈఈ మురళీధర్‌రావు, శింగనమల, రాప్తాడు, గుత్తి డీఈలు శ్రీరాములు, శ్రీధర్, రెహనావసీం పాల్గొన్నారు.

వేరుకుళ్లు తెగుళ్లపై జాగ్రత్తలు తీసుకోండి

● జిల్లా ఉద్యాన శాఖాధికారి నరసింహారావు

గార్లదిన్నె, మార్చి 6(ఆంధ్రజ్యోతి): చీనీచెట్లకు సోకుతున్న వేరుకుళ్ల తెగుళ్లపై జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు సూచించారు. గురువారం మండలంలోని సిరివరం, కొప్పలకొండ గ్రామాల్లో చీనితోటలను ఆయన పరిశీలించారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ సూక్ష్మధాతు పోషకాల లోపాలు లేకుండా చూసుకోవాలని పలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్, విస్తరణ అధికారులు రామాంజినేయులు, శ్రీనివాసులు, గంపరాజు, మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

నేడు ఉరవకొండ నుంచి రైతుల పాదయాత్ర

అనంతపురం కల్చరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన మిరప, పత్తి, పప్పుశనగ, సీడ్ జొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, పంటను ప్రభుత్వమే కొనుగో లు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉరవకొండ నుంచి రైతుల పాదయాత్రను ప్రారంభించనున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాదయాత్ర ఈ నెల 10వ తేదీ నాటికి అనంతపురం నగరం చేరుకుంటుందని, అదే రోజున కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి ధర్నా చేపడుతామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రాప్తాడు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర సమీపంలో పండమేరు బ్రిడ్జి వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బండమీదపల్లికి చెందిన మాధవరాజు తీవ్రంగా గాయపడ్డాడు. మాధవరాజు వ్యక్తిగత పని నిమిత్తం గురువారం స్వగ్రామం బండమీదపల్లి నుంచి అనంతపురానికి ద్విచక్రవాహనంలో వెళ్లాడు. పని పూర్తయిన తరువాత బండమీదపల్లికి వస్తుండగా పండమేరు బ్రిడ్జి సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో గాయపడిన మాధవరాజును స్థానికులు అంబులెన్స్‌లో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం మాధవరాజు పరిస్థితి తీవ్ర విషమంగా ఉందని వైద్యులు తెలిపినట్లు సమాచారం .

ఘనంగా మహిళా దినోత్సవం


ముగ్గులను తిలకిస్తున్న పెరుమాళ్ల మమతారెడ్డి

అనంతపురం కల్చరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పామిడి మండలం గజరాంపల్లిలోని వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్‌లో గురువారం మహిళా దినోత్స వాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గార్మెంట్స్ పరిశ్రమ ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పరిశ్రమలోని మహిళా సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్ అధినేత్రి పెరుమాళ్ల మమతారెడ్డి మాట్లాడుతూ... మహిళల అభివృద్ధికి చేయూత నందించాలన్న ఉద్దేశంతో వ్యాలీ గ్రీన్ గార్మెంట్ పరిశ్రమ ఏర్పాటు చేశామన్నారు.

ఎమ్మెల్యేకి రాజీవ్‌కాలనీ నాయకుల కృతజ్ఞతలు


ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

అనంతపురం రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజీవ్ కాలనీకి చెందిన టీడీపీ నాయకులు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే గురువారం అసెంబ్లీలో డంపింగ్ యార్డు సమస్యను ప్రస్తావించడంతో పాటు యార్డును మరొక చోటికి తరలించేందుకు స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో విజయవాడలో ఎమ్మెల్యేని కలసి కృతజ్ఞతలు తెలిపినట్లు రాజీవ్‌కాలనీ పంచాయతీ నాయకులు కనుమచౌదయ్య, రాయల్ కేశవ తదితరులు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... గత కొన్నేళ్లుగా డంపింగ్ యార్డు సమస్యతో వేలాదిమంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అయితే ఎవరూ దీనికి పరిష్కారం చూపలేదన్నారు. డంపింగ్ తరలిస్తామనిఎన్నికల మునుపు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హామీ ఇచ్చారని, ఆమేరకు అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇప్పుడు అసెంబ్లీలో సమస్యను ప్రస్తావించడంతో పాటు శాశ్వత పరిష్కారానికి అడుగులు పడ్డాయన్నారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు జకీవుల్లా, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కోనంకి గంగారామ్, రాయల్ మురళి, లక్ష్మీనరసింహ, అమర్నాథ్‌చౌదరి, ధరూర్ ఓబుల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను నియంత్రించాలి : డీఎంహెచ్‌ఓ

అనంతపురం టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులతో ప్రబలే సీజనల్ వ్యాధుల నియంత్రణకు డాక్టర్లు, సిబ్బంది తగిన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీ దేవి సూచించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో గురువారం వ్యాధుల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ... ఆరోగ్యశాఖ ద్వారా నిరంతరం నిర్వహించే వైద్యసేవలతో పాటు వాతావరణ మార్పులతో వచ్చే వ్యాధుల నియంత్రణకు అందించే వైద్యసేవలకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఎండాకాలంలో వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టరు ఓబులు, ప్రోగ్రామ్ అధికారి రవిశంకర్, డెమో త్యాగరాజు, పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

10న ముగియనున్న డిగ్రీ పరీక్షల ఫీజు గడువు

అనంతపురం సెంట్రల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ పరీక్షల ఫీజుల చెల్లింపు గడవు ఈ నెల 10న ముగియనున్నట్లు ఎస్కేయూ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్(సీఈ) డాక్టర్ లోకేష్ తెలిపారు. డిగ్రీ బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ బీబీఎం కోర్సుల విద్యార్థులకు ద్వితీయ, నాలుగు, ఆరవ సెమిస్టర్ పరీక్షల నిర్వహణ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 24న విడుదల చేశామన్నారు. జరిమానా లేకుండా 10వరకు, రూ.500 జరిమానాతో 12వరకు చెల్లించ వచ్చని తెలిపారు. 15వరకు రూ.3వేల జరిమానా చెల్లించాల్సి ఉంటుందన్నారు.

మీరైనా స్థలాలివ్వండి : సీపీఐ

అనంతపురం రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం 32 లక్షల మందికి ఇంటి స్థలాల పేరిట పట్టా కాగితాలు ఇచ్చి చేతులు దులుపుకుందని, కూటమి ప్రభుత్వమైనా స్థలాలను ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ కోరారు. పార్టీ నగర సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. నగర కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షత వహించారు. స్థలాలు ఆశిస్తున్న పేదలు పలువురు ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడా ఇళ్ల నిర్మాణం జరగలేదని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వం 80 నుంచి 90 శాతం నిర్మించిన టిడ్కో ఇళ్లను కూడా వైసీపీ ప్రభుత్వం పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు గ్రామీణ పేదలకు మూడు సెంట్లు, పట్టణ పేదలకు రెండు సెంట్లు స్థలం ఇవ్వాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రాజాకు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున నగర సహాయ కార్యదర్శులు రమణయ్య, అల్లీపీరా తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ ద్వారా ప్రపంచంతో అనుసంధానం: వీసీ

అనంతపురం సెంట్రల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఎస్ఐ) సభ్యత్వం ద్వారా సాంకేతిక విజ్ఞాన ప్రపంచంతో అనుసంధానం ఏర్పడుతుందని జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు తెలిపారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం సీఎస్ఐ స్టూడెంట్ చాప్టర్ ప్రారంభోత్సవాలను నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కేఎఫ్ భారతి అధ్యక్షతన ఏర్పాటుచేసిన వేడుకలకు వీసీ సుదర్శనరావు, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. సీఎస్ఐ స్టూడెంట్ చాప్టర్‌పై వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ మాధవి, కోఆర్డినేటర్ రాజశేఖర్, విభాగాధిపతులు పాల్గొన్నారు.

మరువకొమ్మ వద్ద ఫ్లైఓవర్ నిర్మించండి

● ఆర్ అండ్ బీ మంత్రికి ఎమ్మెల్యే శ్రావణిశ్రీ విన్నపం


మంత్రి జనార్దన్‌రెడ్డి ని కలసి విన్నవిస్తున్న ఎమ్మెల్యే

శింగనమల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక శింగనమల శ్రీరంగనాయక చెరువు మరువకొమ్మ రోడ్డు వద్ద ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి విన్నవించారు. విజయవాడలో మంత్రిని గురువారం కలసి నియోజకవర్గంలోని రహదారుల సమస్యలపై వివరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఆ మె మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గం పరిధిలోని బుక్కరాయ సముద్రం, శింగనమల, నార్పల మండలాల్లో ఆమరావతికి ఆరు వరుసల రోడ్డు పనులు జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా శింగనమల చెరువు మరవకొమ్మ వద్ద నియోజకవర్గం కేంద్రమైన శింగనమలకు వెళ్లేందుకు సరైన రోడ్డును అధికారులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కావున మరువకొమ్మ వద్ద ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే శింగనమల చెరువు నిండి మరువ పారితే శింగనమల, గార్లదిన్నె, అనంతపురానికి రాకపోకలు నిలిపోతాయన్నారు. భవిష్యత్తులో ఇబ్బందులు కలుగకుండా అక్కడ రోడ్డుపైన ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికి మరమ్మతులకు నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే పెర్కొన్నారు.

నియోజకవర్గ సమస్యలపై పలువురు మంత్రులతో భేటీ

● శింగనమల: నియోజకవర్గంలోని పలు సమస్యలపై ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆయా శాఖల మంత్రులను కలసి వినతి పత్రాలు అందజేశారు. ఆమె గురువారం విజయవాడలో మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కలిసి నియోజకవర్గంలోని బుక్కరాయ సముద్రం జంతులూరు వద్ద నున్న సెంట్రల్ యూనివర్సిటీ వద్ద ప్రభుత్వం తరుపున అరకు కాఫీ స్టాల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే నియోజకవర్గంలోని ఎస్టీల పలు సమస్యలపై వివరించారు. తరువాత విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలసి నియోజకవర్గం పరిధిలో విద్యుత్ లైన్‌మ్యాన్‌ల కొరత లేకుండా చేయాలని, అలాగే రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను అదనంగా కేటాయించాలని, విద్యుత్ సరాఫరాలో అంతరాయం లేకుండా చూడాలని కోరారు. మంత్రులు స్పందిస్తూ సమస్యలపై సానూకులంగా హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలి: ఎమ్మెల్యే

● శింగనమల: దేశంలో చేనేత పరిశ్రమను పొత్సహించేందుకు ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అన్నారు. రాష్ట్ర సెక్రటేరియట్‌లోని మూడో బ్లాక్‌లో గురువారం ప్రభు త్వం ఏర్పాటు చేసిన ఆప్కో హ్యాండ్లూమ్ స్టాల్ ప్రారంభ కార్య క్రమంలో బీసీ చేనేత శాఖ మంత్రి సవిత, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్టాల్‌లో చేనేత వస్త్రాలు కొనుగోలు చేశారు. ప్రతిఒక్కరిని ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి జన్మతిథి


బృందావనానికి పూజలు

అనంతపురం కల్చరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మంత్రాలయ రాఘవేంద్ర స్వామి జన్మతిథిని పురస్కరించుకుని గురువారం మొదటి రోడ్డులోని రాఘవేంద్రస్వామి మఠంలో వేడుకలను భక్తిశ్రద్ధ లతో నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర స్వామి బృందావనాన్ని వివిధ రకాల పుష్పాలతో నయనమనోహరంగా అలంకరించారు. పుష్పార్చన, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు వందలాదిగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మహా మంగళహారతి నివేదనానంతరం మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మఠం మేనేజర్ కోటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

జగన్‌కు పవన్ స్ట్రోక్ తగిలింది

● అందుకే మతిభ్రమించి మాట్లాడుతున్నాడు: టీసీ వరుణ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ స్ట్రోక్ తగిలిందని... అందుకే మతిభ్రమించి మా ట్లాడుతున్నారని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్ అన్నారు. ఈ మేర కు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలను జగన్‌రెడ్డి వెనక్కు తీసుకోవాలన్నారు. ప్రజలు వైసీపీకి కనీసం ప్రతిపక్ష హోదా ఇవ్వనప్పటికీ... ఆ అవకాశం రాదని తెలిసికూడా జగన్‌రెడ్డి గగ్గోలు పెడుతున్నా రన్నారు. వైసీపీ ఎక్కడ ఖాళీ అయిపోతుందోనన్న భయంతోనే పవన్‌పై వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే జనసైనికుల ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

డీఎంఎల్‌టీ పరీక్షల్లో మెరిసిన కావ్య


కావ్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

అనంతపురంటౌన్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ (పారా మెడికల్) పరీక్షల ఫలితాల్లో అనంతకు చెందిన కావ్య రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకును కైవసం చేసుకుంది. అనంత మెడికల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని కావ్య 480కిగాను 416మార్కులతో టాప్ ర్యాంకును సొంతం చేసుకుంది. విద్యార్థినిని గురువారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శంషాద్‌బేగం, డాక్టర్ షారోన్ సోనియా అభినందించారు.

సీడ్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

డీఎంఎల్‌టీ పరీక్షల్లో సీడ్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. కళాశాలకు చెందిన హాజీమస్తాన్ వలి, జోగివీణ, షేక్ అసిఫ్ రాష్ట్రస్థాయిలో 2, 3, 4 ర్యాంకులు సాధించారని కరస్పాండెంట్ రంగనాయకులు తెలిపారు.

రేపు 'ఉన్నతి' మెగా చెక్కు విడుదల

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో 'ఉన్నతి' పథకం కింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన మహిళలకు శనివారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రూ. 1.70 కోట్ల మెగా చెక్కును అందజేస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాధిక తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్నతి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారిలో 119 మందిని ఎంపిక చేశారన్నారు. వీరందరికి రూ. లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ రుణాలు అందిస్తామన్నారు. ఇందులో వీరికి సబ్సిడీ రూపేణా 50 శాతం లభిస్తుందన్నారు. మిగిలిన మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ సమక్షంలో ఈనెల 8వ తేదీన మెగా చెక్కును విడుదల చేయడం జరుగుతుందన్నారు.


CELEBRATING
26
YEARS OF VIJETHA
ANNIVERSARY CELEBRATIONS
విజేత
Fresh Healthy Living
On Purchase of ₹999/- Get
VIJETHA PREMIUM SUGAR 1KG ₹52/-
FREE
OFFERS VALID FROM 7th TO 9th MARCH 2025 ONLY.
CABBAGE PER KG Vijetha Price ₹14
TOMATO LOCAL PER KG Vijetha Price ₹15
CAULIFLOWER PER PC Vijetha Price 24
KHEERA PER KG Vijetha Price ₹24
CARROT PER KG Vijetha Price ₹29
BEET ROOT PER KG Vijetha Price ₹25
POTATO PER KG Vijetha Price ₹29
ONION RED PER KG Vijetha Price ₹39
GINGER PER KG Vijetha Price ₹59
KIRAN MELON PER KG Vijetha Price ₹16
KHARBUJA (MUSK MELON) PER KG Vijetha Price ₹35
MOSAMBI PER KG Vijetha Price ₹54
GRAPES GREEN SEEDLESS PUNET PER PUNET Vijetha Price ₹59
ORANGE NAGPUR PER KG Vijetha Price ₹79
SUGAR PREMIUM 1 KG PACK Vijetha Price ₹49
TOORDAL PREMIUM 1 KG PACK Vijetha Price ₹149
URAD ROUND PREMIUM 1 KG PACK Vijetha Price ₹149
GROUNDNUT PREMIUM 1 KG PACK Vijetha Price ₹168
BASMATHI RICE 1 KG PACK Vijetha Price ₹99
AADHAAR SUNFLOWE OIL 1LTR POUCH MRP ₹ 188 Vijetha Price ₹139 ONLY
RAAGA SUNFLOWER OIL 1LT POUCH MRP ₹ 165 Vijetha Price ₹139 ONLY
SAFFOLA OIL GOLD 5LT GET 5KG AASHIRVAAD POPULAR ATTA WORTH ₹355/- MRP ₹ 1182 Vijetha Price FREE
GOLD DROP SUNFLOWER OIL 1 Ltr POUCH MRP ₹ 165 Vijetha Price ₹147 ONLY
SAFFOLA OIL ACTIVE 1LT MRP ₹ 197 Vijetha Price ₹138 ONLY
ORIGINAL KIMIA DATES 400G BOX MRP ₹ 310 Vijetha Offer BUY 1 GET 1 FREE
COCOJAL TENDER COCONUT WATER 200ML MRP ₹ 55 Vijetha Offer BUY 1 GET 1 FREE
BNATURAL JUICE 1LT MRP ₹ 140 Vijetha Offer BUY 1 GET 1 FREE
COCO ROYAL BASIL SEED 290ML (ENTIRE RANGE) MRP ₹ 99 Vijetha Offer BUY 1 GET 1 FREE
MAAZA MANGO PET 1.75LT MRP ₹ 105 Vijetha Offer ₹30 OFF ON MRP
MINUTE MAID PET PULPY ORANGE 1LT MRP ₹ 90 Vijetha Offer ₹15 OFF ON MRP
COKE ZERO SUGAR PET 750ML MRP ₹ 45 Vijetha Offer BUY 1 GET 1 FREE
SUNFEAST MOMS MAGIC CASHEW&ALMOND COOKIES 94.5G MRP ₹ 35 Vijetha Offer BUY 1 GET 1 FREE
SUNFEAST YIPPEE NOODLES MAGIC MASALA 280G MRP ₹ 56 Vijetha Offer ₹20 OFF ON MRP
TAJ MAHAL TEA LEAF 500G MRP ₹ 470 Vijetha Offer ₹75 OFF ON MRP
BRU INSTANT COFFEE PWD 100G POUCH MRP ₹ 325 Vijetha Offer ₹70 OFF ON MRP
PARACHUTE ADVANCED GOLD COCONUT HAIR OIL 500ML MRP ₹ 400 Vijetha Offer BUY 1 GET 1 FREE
PARACHUTE COCONUT OIL 600ML MRP ₹ 305 Vijetha Offer ₹75 OFF ON MRP
SURF EXCEL MATIC LIQUID FRONT LOAD4LTR MRP ₹ 885 Vijetha Offer ₹265 OFF ON MRP
SURF EXCEL SOAP200G*4 BAR 800G SET MRP ₹ 125 Vijetha Offer ₹20 OFF ON MRP
VIM ANTI SMELL BAR 5X200G MRP ₹ 130 Vijetha Offer ₹40 OFF ON MRP
PONDS TALC MAGIC / DREAM FLOWER 400G / SANDAL 300G MRP ₹ 300-459 Vijetha Offer BUY 1 GET 1 FREE
VIM DROP LIQUID LEMON 2LT POUCH MRP ₹ 405 Vijetha Offer ₹70 OFF ON MRP
OFFERS VALID FROM 7th TO 9th MARCH 2025 ONLY. VISIT OUR STORE FOR MANY MORE OFFERS
Vijetha Supermarkets Pvt. Ltd.
Telangana • Andhra Pradesh
Maruthi Nagar 80 Feet Road Opp. Y.V. Shiva Reddy House,
Beside Mythrivanam Hotel, Anantapur, Andhra Pradesh - 515001
vijethasupermarkets
VijethaSuperMarketsPvtLtd
VIJETHA Fresh Healthy Living
SINCE 1999

సంక్షిప్త వార్తలు

పవన్‌ను విమర్శించే అర్హత జగన్‌కు లేదు: జనసేన

గుత్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష హోదాలేని వైఎస్ జగన్‌కు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను విమర్శించే అర్హత లేదని నియోజకవర్గ జనసేన నియోజకవర్గ నేత వాసిగిరి మణికంఠ పేర్కొన్నారు. పట్టణంలోని అర్‌అండ్‌బీ అతిథి గృహంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల్లో ప్రజలు వైఎస్ జగన్‌కు తగిన గుణపాఠం చెప్పినా బద్ధి రాలేదన్నారు. జగన్ తన అహంకారపూరితమైన మాటలతో పవన్ కల్యాణ్‌ను విమర్శించడం తగదని ధ్వజమెత్తారు. మరోసారి ఇటాంటి వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. జనసేన పట్టణ, మండల అధ్యక్షుడు చిన్న వెంకటేశులు, పాటిల్ సురేష్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌ను అభివృద్ధి చేయండి

పామిడి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలని సీపీఐ గుంతకల్లు నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి కోరారు. స్థానిక బస్టాండ్‌ను గురువారం ఆయన సీపీఐ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆర్టీసీ బస్టాండ్‌ను అధికారులు అభివృద్ధి చేయాలన్నారు. అలాగే ఎంతో విలువైన బస్టాండ్ స్థలాన్ని పరిరక్షించాలన్నారు. ఆ స్థలం అన్యాక్రాంతమైతే దశల వారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సీపీఐ నాయకులు రహీం, ఓంకార్, సబిరాబి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


లోకేష్ (ఫైల్)

బొమ్మనహాళ్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని నేమకల్లు గ్రామంలో చోటు చేసుకుంది. నేమకల్లుకు చెందిన తలారి హనుమంతు, పార్వతి దంపతుల కుమారుడు లోకేష్(35) గ్రామంలోనే ఫర్టిలైజర్ షాపు నిర్వహిస్తున్నాడు. కాగా బుధవారం రాత్రి అతను బొమ్మనహాళ్‌లో వ్యక్తిగత పని చూసుకుని బైక్‌లో స్వగ్రామానికి బయలుదేరాడు. నేమకల్లు చెక్‌పోస్టు దాటగానే ఎదురుగా మరో బైక్ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. మరో బైక్‌లో వస్తున్న తమిళనాడుకు చెందిన రాజుకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. వారిద్దరినీ స్థానికులు బళ్లారి విమ్స్‌కు తరలించారు. రాజు పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగుళూరుకు తరలించారు. లోకేష్‌ను గురువారం అనంతపురానికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతి చెందాడు. లోకేష్‌కు భార్య అంజలి, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు.

భవనంపై నుంచి పడి వాచ్‌మన్..

అనంతపురం క్రైం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కొత్తగా నిర్మిస్తు న్న ఓ బిల్డింగ్ మీద నుంచి పడి ఓ వాచ్‌మన్ మృతి చెందాడు. కణేకల్లు మండలం యర్రగుంటకు చెందిన వడ్డే తిమ్మన్న(54) కొన్నేళ్ల క్రితం నగర శివారులోని నందమూరినగర్‌లో నివాస ముంటున్నాడు. వాచ్‌మన్‌గా పనిచేసే అతడు బళ్లారి రోడ్డులో కొత్తగా కడుతున్న బిల్డింగ్‌కు వాచ్‌మన్‌గా ఉన్నాడు. బుధవారం ఉదయం రెండో అంతస్తు నుంచి ఆ బిల్డింగ్‌కు నీళ్ల పడుతుండ గా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. అతడిని ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కొడుకులు సంతానం. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో జనసేన నాయకుడు..

పుట్లూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బీసీకాలనీకి చెందిన జనసేన నాయకుడు వెంకటశేఖర్ (35) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న జనసేన, సీపీఐ, సీపీఎం, రైతు సంఘం నాయకులు రామాంజనేయులు, బాలగురయ్య, బాలరంగడు తదితరులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే టీడీపీ మండల నాయకులు చవ్వా కులశేఖర్‌రెడ్డి, చెన్నారెడ్డి వెళ్లి మృతుడి కుటుంబసభ్యుల్ని పరామర్శించారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశానుసారం వారికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

యాడికి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో గల పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను వ్యవసాయశాఖ గుత్తి ఏడీఏ వెంకటరాముడు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సంకల్ప రిటైల్‌స్టోర్‌లో కోర్టు ఉత్తర్వుల మేరకు నెలరోజులు ఎటువంటి ఎరువులకు సంబంధించిన అమ్మకాలు, కొనుగోళ్లు చేయకూడదని చెప్పారు. అలాగే భాస్కర్ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ షాపుల్లో తనిఖీలు నిర్వహించి రూ.10లక్షల విలువైన బయో ఉత్పత్తులను సరైన సర్టిఫికెట్లు చూపించనందున విక్రయాలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దుకాణాల యజమానులను హెచ్చరించారు. అనంతరం మాట్లాడుతూ తప్పనిసరిగా ప్రభుత్వ ఉత్తర్వుల ధృవపత్రాలు ఉన్న ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు మాత్రమే అమ్మకాలు చేయాలని తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా, గ్రామ వ్యవసాయ అధికారి రమేష్ ఉన్నారు.

పాదయాత్రకు తరలిరండి

ఉరవకొండ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ నుంచి అనంతపురం కలెక్టరేట్ వరకూ శుక్రవారం ప్రారంభించనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ పాదయాత్రకు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి హాజరవుతారన్నారు. అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్న డిమాండ్‌తో పాదయాత్ర చేపట్టనున్నట్లు చెప్పారు. రైతులు, కౌలు రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

ప్రతి ఆదివారం ఉచిత మోడల్ పరీక్షలు

గుంతకల్లు టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ సాయి బాలికల డిగ్రీ కళాశాలలో ఆర్‌ఆర్‌బీ, గ్రూప్-డీ, కానిస్టేబుల్ మొయిన్స్‌కు అర్హులైన అభ్యర్థులకు ప్రతి ఆదివారం ఉచిత మోడల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీవైఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు తెలిపారు. కళాశాలలో గురువారం ఆయన మాట్లాడుతూ.. శ్రీధర్స్ సీసీఈ సహకారంతో మోడల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అవకాశాన్ని అభ్యర్థులు వినియోగించుకోవాలని అన్నారు. కళాశాల డైరెక్టర్ రవికిరణ్, డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

గుంతకల్లుటౌన్/ గుత్తి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఐటీయూకాలనీలో గురువారం ఐద్వా మహిళా సంఘం సభ్యులు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఇందిరాగాంధీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జానకి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళా చట్టాలను ప్రతిఒక్కరూ ఉపయోగించుకోవాలని సూచించారు. సచివాలయ మహిళా పోలీస్ రిజ్వాన, అధ్యాపకురాలు శశికళ, ఐద్వా పట్టణ అధ్యక్షురాలు జ్యోతి, నాయకురాళ్లు పాల్గొన్నారు. అలాగే గుత్తి పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అసిస్టెంట్ సీడీపీఓ నాగమణి మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్లను సన్మానించారు. ఏపీ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు రుకీయా బేగం, తహసీల్దారు ఓబులేసు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అనంతపురం కల్చరల్: పామిడి మండలం గజరాంపల్లిలోని వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్ ఆవరణలో మహిళా దినోత్సవం సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. పరిశ్రమలోని మహిళా సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. గార్మెంట్స్ అధినేత్రి పెరుమాళ్ల మమతారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు

శివాయ.. విష్ణురూపాయ..

● విశిష్ట రూపంలో యాడికి శివలక్ష్మీచెన్నకేశవస్వామి ● నేటి నుంచి బ్రహ్మోత్సవాలు


శివలక్ష్మీ చెన్నకేశవస్వామి మూలవిరాట్, అదే పీఠంపై ఉన్న శివలింగం


అబ్బురపరిచే ఆలయ గోపురం

యాడికి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శివలక్ష్మీ చెన్నకేశవాలయంలో శివ, విష్ణురూపాలు ఒకే పీఠంపై కొలువై ఉన్నాయి. ఇక్కడి శివలక్ష్మీచెన్నకేశవస్వామివారు భక్తుల కొంగు బంగారమని ప్రశస్తి. ప్రతి ఏడాది ఫాల్గుణ మాసంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. 11రోజులపాటు ఈ బ్రహ్మోత్సవ వేడుకలను నిర్వహిస్తారు. వైభవంగా నిర్వహించే ఈ వేడుకల వలన గ్రామానికి వేడుకాపురం అనే పూర్వనామంగా ఉందని పెద్దలు చెబుతున్నారు. ఈ వేడుకాపురమే వాడుకలో యాడికిగా మారినట్లు చెబుతుంటారు.

జనమేయ జయుడి నుంచి శ్రీకృష్ణదేవరాయల వరకు..

ఈ శివలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయాన్ని విజయనగరరాజుల కాలంలో జనమేయజయుడు నిర్మించినట్లు చరిత్ర ఆనవాళ్లు చెబుతున్నాయి. ఆ తర్వాత కాలాంతరంలో శ్రీకృష్ణదేవరాయలు ఆలయాన్ని అభివృద్ధి చేసినట్లు, ఆయన హయాంలోనే ఆలయం విశేష ప్రాభవాన్ని సంతరించుకున్నట్లు పెద్దలు చెబుతుంటారు. ఆలయ ప్రాంగణంలోనే భ్రమరాంబికాదేవి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం ఉన్నాయి. స్వామి మంగళ స్నానాలకు పుష్కరిణి ఉన్నాయి. సుమారు 2కిలోమీటర్ల దూరం వరకు కనిపించే ఆలయ రాజగోపురం ఉంది. శ్రీకృష్ణ దేవరాయల కాలంలో ఆలయంలో వేడుకలు అంగరంగవైభవంగా నిర్వహించేవారని, పదిరోజుల పాటు స్వామివారికి వివిధ వాహనసేవలు నిర్వహించేవారని పెద్దలు చెబుతున్నారు. ఆ ఆనవాయితీ నేటికీ కొనసాగుతుండడం విశేషం.

స్వామివారి విశిష్టత

విష్ణురూపంలో ఉన్న చెన్నకేశవస్వామికి సాధారణంగా ఎడమచేతిలో శంఖం, కుడిచేతిలో విష్ణు చక్రం ఉంటాయి. కానీ ఇక్కడి శివలక్ష్మీ చెన్నకేశవస్వామి వారికి ఎడమచేతిలో విష్ణుచక్రం, కుడిచేతిలో శంఖం ఉన్నాయి. అందుకే ఈ ఆల యం ఎంతో ప్రసిద్ధి చెందిందని, శివలక్ష్మీ చెన్నకేశవస్వామి ఎంతో మహిమ కలవారని ఆలయ అర్చకులు, గ్రామపెద్దలు చెబుతున్నారు.

ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు ఎలా చేస్తారంటే..

ఈ నెల 7వతేదీన బ్రహ్మోత్సవాల నిర్వహణకు అంకురార్పణ, ధ్వజారోహణ నిర్వహిస్తారు. 8న పుష్పకవిమాన వాహనసేవ, 9న సింహవాహన సేవ, 10న శేషవాహనసేవ, 11న హనుమద్‌వాహనసేవ, 12న గరుడవాహనసేవ, 13న గజవాహనసేవ, 14న స్వామివారి కల్యాణం, రథోత్సవం, 15న అశ్వవాహన సేవ, 16న హంసవాహనసేవ, 17న శయనోత్సవ సేవ జరగనున్నాయి.

గ్రామీణ క్రీడల నిర్వహణ..

శివలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహించడం కోసం ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక చొరవచూపుతున్నారు. గ్రామీణ క్రీడలను నిర్వహించనున్నారు. ఈనెల 7, 8వ తేదీల్లో రాష్ట్రస్థాయి ఓపెన్ కబడ్డీ పోటీలను నిర్వహించనున్నారు. 9న రాతిగుండు ఎత్తు పోటీలు, 10న ఇరుసు ఎత్తు పోటీలు, 11న కర్రసాము పోటీలు, 15న రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఇవేకాకుండా 7నుంచి 13వ తేదీవరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మహిమాన్వితుడు స్వామివారు



శివలక్ష్మీ చెన్నకేశవస్వామి ఎంతో మహిమగలవా రు. స్వామివారి కుడి, ఎడమచేతుల్లో శంఖు, విష్ణుచక్రం తారుమారుగా ఉండడమే ఇక్కడి విశిష్టత. స్వామివారు ఎంతో మహిమ కలవారు కాబట్టే స్వామివారి కల్యాణం, రథోత్సవం వీక్షించడానికి అనంతపురం, సత్యసాయి, నంద్యాల, కర్నూలు, కడప, బళ్లారి జిల్లాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివస్తారు.

-ఆలూరు హరికృష్ణశర్మ, ఆలయ ప్రధాన అర్చకుడు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు మా దృష్టికి తెండి

● మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆర్డీఓ, డీఎస్పీ


మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

గుంతకల్లు టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గు రువారం గుంతకల్లు రెవెన్యూ డివిజన్ ఎస్సీఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో ఆర్డీఓ శ్రీనివాస్, డీఎస్పీ ఏ.శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రతి నెలాఖరున సివిల్స్ రైట్స్ సమావేశాన్ని నిర్వహించాలని, అందులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు సమస్యలు మా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు హరిప్రసాద్‌యాద్, సాకే గోవిందు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇంకా అంటరానితనం కొనసాగుతోందని, వివక్షత లేని సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. గుత్తి, పామిడిలో ప్రభుత్వ భూములు అన్యక్రాంతం కాకుండా చూడాలని అధికారులను కోరారు. కసాపురంలో గిరిజన భవనం నిర్మించాలని విన్నవించారు. సమావేశంలో డీఎల్‌డీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ రమాదేవి, సీఐలు మనోహర్, మస్తాన్, ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ వెంకటస్వామి, ఎంఈఓ మస్తాన్‌రావు,విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చాకారి రవి, మల్లికార్జున, గుత్తి, పామిడి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ రీసర్వే పరిశీలన


కరగానపల్లిలో భూరీసర్వేను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్

కుందుర్పి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిగానపల్లిలో జరుగుతున్న భూరీసర్వేను కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, ఆర్డీఓ వసంతబాబు గురువారం వేరువేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రీ సర్వేను వేగవంతం చేయడంతో పాటు భూయజమానులు సమక్షంలోనే పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులకు నోటీసులు అందించి వారి సమక్షంలోనే రోవర్ సహాయంతో ఖచ్చితమైహద్దులను నిర్ణయించాలని సూచించారు. సర్వేలో లోపాలు, ఇబ్బందులు ఉంటే తహసీల్దార్ దృష్టికి తీసుకురావాలని భూయజమానులను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం డీఐఓఎస్ అధికారి సుబ్రహ్మణ్యం, మండల సర్వేయర్ పరశురాం, వీఆర్వోలు పాల్గొన్నారు.

శెట్టూరు: మండలంలోని లక్ష్మంపల్లిలో నిర్వహిస్తున్న భూరీసర్వే కార్యక్రమాన్ని కేఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ తనిఖీ చేశారు. ఆయన తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, డిప్యూటీ తహసీల్దార్ అనిల్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

బెళుగుప్ప, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలువపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులకు అదే పాఠశాల పూర్వ విద్యార్థులు గురువారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. పూర్వవిద్యార్థులు పోతిరెడ్డి, చంద్రశేఖర్, రామాంజనేయులు, వనం సతీష్ , ఎం నాగరాజు ఎస్ రామకృష్ణ, పాఠశాల హెచ్‌ఎం కృష్ణప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శెట్టూరు: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో దివ్యాంగ ఉపాధ్యాయుడు సుబ్బరాజు 83 మంది పదో తరగతి విద్యార్థులకు సొంత ఖర్చులతో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా యూనిఫాం..

పుట్లూరు: మండలంలోని కడవకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఓబులాపురానికి చెందిన టీడీపీ మండల నాయకుడు శ్రీనివాసులు నాయుడు రూ.25వేలు విలువగల క్రీడాయూనిఫాం గురువారం వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ట్రైసైకిల్ వితరణ

తాడిపత్రి: పట్టణంలోని రోటరీక్లబ్ కార్యాలయంలో స్థానిక పోరాటకాలనీకి చెందిన మహబూబ్‌బాషాకు రూ.10వేలు విలువగల ట్రైసైకిల్‌ను వితరణ చేసినట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు సుబ్రమణ్యం తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు రఫీ, కుళ్లాయిస్వామి, నాగేంద్ర, మద్దిలేటి, రామయ్య, కిషోర్‌కుమార్, సుబ్బరామయ్య, నాగరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని తరలించరాదు

కళ్యాణదుర్గం రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడప లో నుంచి తరలించరాదని పట్టణంలోని హిందూపురం రోడ్డులో గల ఏపీజీబీ బ్రాంచ్ వద్ద సీఐటీయూ, రాయలసీమ అభివృద్ధి వేదిక నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల మాట్లాడుతూ.. ఏపీజీబీలో మరో మూడు బ్యాంకులను విలీనం చేసి ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడప నుంచి అమరావతికి తరలించాలని చూస్తే రాయలసీమ వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు రంగనాథ్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నర్సరీ దగ్ధం


నర్సరీలో ఎగసిపడుతున్న మంటలు

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల వెజిటబుల్ నర్సరీ గురువారం అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. అయితే అప్పటికే నర్సరీలో ఉన్న నెట్, ట్రేలు మొత్తం ఖాళీ బూడిదయ్యాయని బాధిత రైతు దుర్గం శంకర్ వాపోయారు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడం పెట్టారని అన్నారు. నర్సరీ కాలిపోవడంతో రూ. రెండు లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పశుగ్రాసం...

బొమ్మనహాళ్: మండలంలోని లింగదహాళ్ గ్రామంలో గడ్డివాము కాలిబూడిదైంది. గ్రామానికి చెందిన హనుమంతు అనే రైతు తన దొడ్డిలో 15 ఎకరాల పశుగ్రాసాన్ని రెండు వాములుగా నిల్వ చేశాడు. అయితే గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేయగా అదుపులోకి రాలేదు. రాయదుర్గం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అయితే అప్పటికే గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు రూ.85 వేల మేరకు నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయారు. తనకు గిట్టని వ్యక్తులు ఈ దారుణానికి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

గ్రంథాలయం తనిఖీ

బ్రహ్మసముద్రం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి షిరమ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం పాఠకులతో మాట్లాడుతూ .. గ్రంథాలయంలో పుస్తకాలను వినియోగించుకోవాలని సూచించారు. గ్రంథాలయ అధికారి ఎర్రిస్వామి పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

రాయదుర్గంరూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జుంజురంపల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యుడు డాక్టర్ సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 31 తేదీ వరకు మండలంలోని గ్రామాల్లో గాలికుంటునివారణ టీకాలు వేయనున్నట్లు చెప్పారు. పాడి రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్ రామచంద్ర, సర్పంచ్ వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో యువకుడికి గాయాలు

గుత్తిరూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి) :మండలంలోని గొందిపల్లిలో బుధవారం అర్ధరాత్రి సమయంలో ఓ ఇంటి వద్ద జరిగిన ఘర్షణలో రామకృష్ణ అనే యువకుడికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన రామకృష్ణతో తొండపాడుకు చెందిన ఓంప్రకాష్, దివాకర్, సురేష్, వెంకటేష్ చిన్న పాటి విషయంలో వాగ్వాదానికి దిగారు. మాట, మాట పెరగడంతో ఘర్షణ జరిగి కర్రలతో దాడి చేసుకున్నారు. అందులో రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చిన్నారిని చితకబాదిన అంగన్‌వాడీ టీచర్

ఉరవకొండ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలకేంద్రంలోని మూడో అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అంగన్‌వాడీ టీచర్ సునీత చిన్నారి హేమవర్షిణిని చితకబాదింది. చిన్నారి అల్లరి చేస్తోందన్న కారణంలో వీపుపై వాతలు పడేలా కొట్టింది. దీంతో విషయం తెలుసుకున్న చిన్నారి తల్లిదండ్రులు అక్కడికి చేరుకుని ఆమెను నిలదీశారు. ఇష్టానుసారంగా వీపు మీద వాతలు పడేలా కొట్టడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సీడీపీవోకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

అబ్బేదొడ్డిలో చిరుత సంచారం..

గుత్తిరూరల్, మార్చి6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బేదొడ్డి గ్రామశివారులో చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్థులు భయందోళన చెందారు. బుధవారం రాత్రి రైతులు పంట పొలాలకు వెళ్తుండగా చిరుతపులి కనిపించడంతో గ్రామస్థులకు తెలిపారు. గ్రామస్థులు వెంటనే అక్కడికి వెళ్లి టార్చి లైట్లు వేయగా.. చిరుత అక్కడి నుంచి చెరువులోని కంచెట్లులోకి వెళిపోయింది. పొలాల్లోకి వెళ్లాలంటే భయంగా ఉందని, అటవీ శాఖ అధికారులు స్పందించి వాటిని పెద్ద అడవుల్లో వదలాని గ్రామస్థులు కోరారు.

మట్కా బీటర్ల అరెస్టు

తాడిపత్రి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో గురువారం నలుగురు మట్కా బీటర్లను అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.30వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించి అరెస్టు చేశామన్నారు. అనంతరం వారిపై కేసు నమోదుచేసినట్లు పేర్కొన్నారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం

తాడిపత్రి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కడప రహదారిలో గతంలో పట్టుబడిన 38కేసులకు సంబంధించి దాదాపు 132 లీటర్ల మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు గురువారం ధ్వంసం చేశారు. అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరిండెంట్ రేవతి ఆధ్వర్యంలో ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ నాయుడు తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ఉద్యోగోన్నతి

పుట్లూరు, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ సామెల్‌కు ఏఎస్‌ఐగా పదోన్నతి లభించింది. ఈ మేరకు గురువారం ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. స్టేషన్‌లోని సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

20లోగా రుణాలు రెన్యూవల్ చేసుకోండి

బొమ్మనహాళ్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్ట ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలో తీసుకున్న రుణాలను రైతులు ఈ నెల 20 వ తేదీ లోపు రెన్యూవల్ చేసుకోవాలని సీఈఓ నాగరాజు తెలిపారు. మండలకేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాలు చెల్లించి రశీదు పొందాలని చెప్పారు.

నెమలి వాహనంపై చంద్రమౌళీశ్వరుడు


నెమలి వాహనంపై స్వామివారు

ఉరవకొండ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవిమఠంలో చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం మూడోరోజు స్వామి వారు నెమలి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయమే అర్చకులు ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తిని మఠం నుంచి మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి నెమలి వాహనంపై కొలువుదీర్చారు. గవిమఠం నుంచి ఎదురుబసవన్న గుడి వరకూ ఊరేగింపు చేశారు. ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, గవిమఠం సహాయకమిషనర్ రాణి, ఎస్ఐ జనార్ధన నాయుడు, ఏజెంట్ రాజన్నగౌడ్, గవిమఠం సిబ్బంది పాల్గొన్నారు. చంద్రమౌళీశ్వర స్వామి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అడ్డపల్లకి ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

షీరోస్ పుస్తకావిష్కరణ

కుందుర్పి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం పుస్తకమిత్ర ప్రచురించిన షీరోస్ పుస్తకావిష్కరణ జరిగింది. స్థానిక రాధాస్వామి విద్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో నిర్మల, రుషి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ, రాధాస్వామి విద్యాలయం ప్రిన్సిపాల్ సుశీల ముఖ్య అతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు ముఖ్యులు రాజు, రఘువీరా, శ్రీకాంత్, చరణ్ మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భారతీయ ధీర వనితల జీవితాలే ఇతివృత్తాలుగా ఏకపాత్రాభినయ పోటీలను నిర్వహిస్తున్నామని, విద్యార్థినులందరూ పాల్గొనాలని కోరారు. ఆసక్తిగలవారు 8309766881, 8328063844 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు

యాడికి, మార్చి 6(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపును గురువారం చేపట్టారు. ఆలయ ఈఓ దుర్గాప్రసాద్, తాడిపత్రి దేవాదాయశాఖ ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రూ.1,55,210 ఆదాయం హుండీ ద్వారా వచ్చినట్లు ఆలయ ఈఓ తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు హరికృష్ణశర్మ, బ్రహ్మోత్సవాల పర్యవేక్షకులు వేలూరు రంగయ్య, రుద్రమనాయుడు, తిరంపురం నీలకంఠ, రాజశేఖర్‌నాయుడు, ఆదినారాయణ, తాండ్ర విక్రమ్ పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి జయంత్యుత్సవాలు


విశేష అలంకరణలో బృందావనం

తాడిపత్రి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గురురాఘవేంద్రస్వామి మఠంలో గురువారం స్వామివారి జయంత్యుత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మఠం నిర్వాహకులు మూల బృందావనానికి నిర్మల్య విసర్జనము, అష్టోత్తర పారాయణ, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణలు, పాదపూజ, కనకమహాపూజ తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో బృందావనాన్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెరటి కోళ్ల పంపిణీ

శెట్టూరు/ బెళుగుప్ప, మార్చి 6(ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ వెలుగు సంస్థ ద్వారా ఎస్టీ కార్పొరేషన్ నిధులతో 19 మంది లబ్ధిదారులకు గురువారం మండలకేంద్రంలోని వెలుగు కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోళ్లు పెంచుకుంటూ ఆర్థికంగా బలపడడానికి ప్రభుత్వం సబ్సిడీపై వాటిని అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీఎం గంగన్న, వెటర్నరీ ఏడీఏ నాగలింగేశ్వరరెడ్డి, పశువైద్యాధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బెళుగుప్ప మండలకేంద్రంలోని రవితేజ మండల సమాఖ్య కార్యాలయంలో 27 యూనిట్ల పెరటి కోళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు పశువైద్యుడు రమేష్ తెలిపారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, పశుసంవర్ధక శాఖాధికారి వెంకటస్వామి, డాక్టర్ ఉపేంద్ర పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది నిరసన

రాయదుర్గంరూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎంపీడీఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ కొండన్నను వజ్రవన్నూరు ఎంపీటీసీ సభ్యుడు అరుణ్‌కుమార్ నీ అంతు చూస్తానంటూ బెదిరించడం ఏంటని ఈఓఆర్డీ మురళీకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ ఆజాద్‌రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై గురువారం కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈఓఆర్డీ, సీనియర్ అసిస్టెంట్ మాట్లాడుతూ.. ఎంపీడీఓలకే రక్షణ లేకపోతే సాధారణ ఉద్యోగుల పరిస్థితి ఏంటని వాపోయారు. ఎంపీడీఓతో వాగ్వివాదానికి దిగిన ఎంపీటీసీ అరుణ్‌కుమార్ వెంటనే క్షమాపణ చెప్పాలన్నారు. అనంతరం కార్యాలయానికి తాళం వేసి విధులను బహిష్కరించారు.


ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు